Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

హైదరాబాద్,మంగళవారం,
జూన్ 09, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:312

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

మంగళవారం, తేది:09-06-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-గ్రీష్మరుతువు,బహుళ పక్షం,నవమి.ఉత్తరాభాద్ర,వర్జ్యం,ప.2.28 ల 4.03

## రూ.110కోట్లతో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్: భట్టి

హైదరాబాద్ (మెట్రోన్యూస్): లోయర్ ట్యాంక్బండ్ రూ.110కోట్లతో పది అంతస్తుల అత్యాధునిక అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తొలి విడతగా రూ.50 కోట్లు విడుదలయ్యాయని, నిరుపేద విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ, ఉన్నత శిక్షణ అందిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నింబోలి అడ్డ ఎస్సీ హాస్టల్ను ఆధునికీకరించి, బాబు జగ్జీవన్ రామ్ భవన్ గా మారుస్తామన్నారు.

## జెండాలు అజెండాలు

# నగరాభివృద్ధికి అడ్డుకావద్దు

### అడ్డుపుల్లలు వేస్తున్న కిషన్‌రెడ్డి
### మియాపూర్ బహిరంగసభలో సీఎం



హైదరాబాద్ (మెట్రో న్యూస్):హైదరాబాద్ మహా నగరం వేగంగా విస్తరిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికే మహా నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాం...విస్తరిస్తున్న నగరం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మూడు కార్పొరేషన్లు చేశాం... పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా సరిహద్దులు నిర్ణయించాం... జెండాలకు ఎజెండాలకు అతీతంగా మన నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం అని పిలుపునిచ్చారు. రాబోయే 24 నెలలు అభివృద్ధిపైనే మా దృష్టి ఉంటుందన్నారు. రాజకీయాలకు అతీతంగా నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. సోమవారం సాయంత్రం మియాపూర్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు మియాపూర్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం భవనానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1674 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నినిమియాపూర్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదని నిలదీశారు. బీజేపీ ఎంపీలు ప్రధాని మోదీని ఎందుకు నిధులు అడగడం లేదు? తెలంగాణ అభివృద్ధికి నిధులు రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డి కాదా? మోదీ గుజరాత్ లో సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే ఆహా ఓహో అంటున్నారు. మనం మూసీని అభివృద్ధి చేస్తామంటే అడ్డుకుంటున్నారు అని మండిపడ్డారు. పదేళ్ల కెసీఆర్ పాలన , పన్నెండేళ్ల మోదీ పాలన, 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధం అని ఆహ్వానించారు. ఎవరేం చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి అన్నారు.



# పకడ్బందీగా 'ఎస్ఐఆర్'

### భద్రత, సహకారంపై పోలీసులకు ఆదేశం
### సమస్యాత్మక ప్రాంతాలపై ఎన్నికల కమిషన్ సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్ పెట్రోలింగ్‌ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




# 9మంది సజీవ దహనం

*హాట్ మెటల్ ల్యాడిల్స్ కిందపడి సజీవదహనం*
*స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో చోటుచేసుకున్న ఘటన*
*పలువురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు*
*మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన*

విశాఖపట్నం (మెట్రోన్యూస్): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో సోమవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో 9మంది కార్మికులు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో ఈ విషాదం ఘటన చోటుచేసుకుంది.
స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో కన్వేయర్ ద్వారా హాట్ మెటల్ (మరుగుతున్న ఉక్కు ద్రవం) ఉన్న ల్యాడిల్స్‌ను తరలిస్తుండగా అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఉన్న ఉక్కు ద్రవం... కింద పని చేస్తున్న కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.

## తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సోమవారం ప్రవేశించాయి. నారాయణ పేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. దీంతో సుదీర్ఘకాలంగా కొన సాగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఈ నెల 4వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు క్రమంగా కదులుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాలను దాటి తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు ఇవి విస్తరిస్తాయన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

### కూటమి డిమాండ్
### 25 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరు

ఢిల్లీ (మెట్రోన్యూస్):నీట్, సీబీఎస్ఈ పరీక్షల వివాదాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణ వే రాజీనామా చేయాలని 'ఇండియా' కూటమి నేతలు డిమాండ్ చేశారు.దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశం ముగిసిన అనంతరం కాంగ్రెస్ జాతీ యాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో మొత్తం 25 ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు పాల్గొని భవిష్యత్తు వ్యూహాలపై చర్చించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.






# మహిళా సంఘాలకు మరో 353 ఆర్టీసీ బస్సులు

### నేడు ప్రధానం చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
### ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ముఖ్యమంత్రిచే రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 553 ఆర్టీసి బస్సులను ప్రదానం చేసే కార్యక్రమం మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. సోమవారం సచివాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లపై మంత్రులు డి.అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్ రెడ్డిలతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, దేశంలోనే ఆదర్శవంతంగా మహిళా సాధికారతకు వినూత్న పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూతనిస్తున్నదని సీఎస్ అన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ రామునాయిక్ సస్పెండ్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులే కంచే చేను మేసినట్లుగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని అటువంటి వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుం టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయ త్నాలను ప్రోత్సహించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరిం చారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయిక్ అనేక భూదం దాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో తక్షణమే రాము నాయిక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

## ఎబోలాపై ప్రభుత్వం అప్రమత్తం

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిఘా కట్టుదిట్టం!**

హైదరాబాద్ (మెట్రోన్యూస్): ప్రపంచాన్ని టెన్షన్ పెడుతున్న ఎబోలా వైరస్ నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో ఉన్నత స్థాయి సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో (స్క్రీనింగ్, సర్వైలెన్స్‌ను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయం నుంచే 21 రోజుల పాటు కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.విదేశీ ప్రయాణికులతో కమ్యూనికేషన్ సులువుగా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు తెలిసిన సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు.

## ఇజ్రాయెల్‌పై దాడుల నిలిపివేత

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో తాజాగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌పై చేపట్టిన తాజా సైనిక చర్యలను ముగిస్తున్నట్లు ప్రకటించింది. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగితే మాత్రం మరింత తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించింది. ఇటీవల బీరుట్ సమీపంలో జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ క్షిపణి దాడులు చేపట్టింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ఇజ్రాయెల్‌పై దాడి వెనకున్న తమ లక్ష్యాలు నెరవేరాయని, ప్రస్తుత దశలో సైనిక చర్యలను నిలిపివేస్తున్నట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇకపై, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగితే, తమ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది. సోమవారం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ ప్రయోగించిన పలు డ్రోన్‌లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చేశాయని పేర్కొంది.

మెట్రో

2 హైదరాబాద్, మంగళవారం జూన్ 9, 2026

# సంక్షేమ రాజ్య నిర్మాణమే లక్ష్యం

**● రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్**

**● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్‌కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్ బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని నింబోలిఅడ్డా హాస్టల్ ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంబేద్కర్‌నాలెడ్జ్‌సెంటర్‌ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎంవెల్లడించారు. నాలెడ్జ్ సెంటర్‌లోస్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్‌లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# మంత్రి పొన్నంతో కృష్ణయ్య భేటీ



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** సచివాయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు సోమవారం సమావేశ మయ్యారు. బీసీల సమస్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ కు వారు వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రంలో బీసీ గురుకులాలు హాస్టల్ లకు సొంత భవనాలు నిర్మించాలని ,పెండింగ్ ఫీజుల బకాయిలు చెల్లించాలని , బీసీ రిజర్వేషన్ల రోస్టర్ విధానం సవరించాలని ,విదేశీ విద్య నిధి సంఖ్య పెంచాలని , బీసీ సంక్షేమ శాఖ లో బీసీ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నేతలు కోరారు.సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,రాజేందర్ ,కార్యదర్శి పృథ్వీ గౌడ్ , బలరాం, సాయి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాల పై బీఆర్ఎస్ అన్యాయం

**- తెలంగాణ లైవ్ స్టాక్ చైర్మన్ సీకే యాదవ్**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు సెంటిమెంట్ తో రెచ్చగొట్టే వ్యాక్యాలు చేస్తున్నారని గోదావరి జలాల విషయంలో అన్యాయం బీ ఆర్ ఎస్సే అన్యాయం చేసిందని లైవ్ స్టాక్ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లొ ఆయన మీడియాతో మాట్లాడారు.సమాఖ్య రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని ఇప్పుడు తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు.కృష్ణ జలాల విషయంలో 71శాతం నీళ్లు కావాలని కాంగ్రెస్ పోరాటం చేస్తుందని ఆఖరికి 50శాతం ఇవ్వండని డిమాండ్ చేస్తుందని తెలిపారు.గోదావరి జలాల విషయంలో మొదటి నుండి కోట్లడేది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. బీఆర్ఎస్ హయంలో ఎలాంటి ప్రాజెక్ట్ పూర్తికాలేదని హరీష్ రావు నోటికి ఎంతోస్తే అంత మాట్లాడుతున్నారన్నారు.ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన తెలిపారు. కృష్ణ, గోదావరి జలాల పేరిట తెలంగాణ ప్రజలను హరీష్ రావు తప్పు ద్రోవ పట్టిస్తున్నారని తెలిపారు.హరీష్ రావు తెలంగాణ సమాజాన్ని తప్పుద్రోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని కోరారు.కేంద్రం కమిటి వేసిందని ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు, అపెక్స్ కమిటి, ట్రిబ్యునల్ ఎక్కడ నిర్ణ యాలు తీసుకోలేదన్నారు.95వేల కోట్లతో పాలమూరు రంగారెడ్డి ఖర్చు అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే నిధులు ఇస్తుందని తెలిపారు.అరకోరక నిధులతో బీఆర్ ఎస్ అనేక ప్రాజెక్టులను పెండింగ్ లో ఉంచిందని ఆరోపించారు.కృష్ణ వాటర్ ద్వారానే మొదటిసారి హైదరాబాద్‌కు నీళ్ళు తెచ్చింది కాంగ్రెస్ చరణ్ కౌశిక్ యాదవ్ తెలిపారు.

# కిషన్ రెడ్డిపై వీహెచ్ ఫైర్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కువ మాట్లాడుతున్నారని రాహుల్ గాంధీ ప్రధాని కాలేరని ప్రగల్బాలు పలుకు తున్నాడని మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు తెలిపారు.సోమవారం ఆయన గాంధీ భవన్లో మీడియా తో మాట్లాడారు కేంద్రమంత్రి స్టేట్మెంట్లకే పరిమితం అయ్యాడని తెలిపారు. తెలంగాణలో గెలిసింది కాంగ్రెసని తెలిపారు రాష్ట్ర అభివృద్ధిలొ కేంద్రమంత్రిగా నీ పాత్ర లేదా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ బీసీలకు అన్యాయం జరుగుతుందని గమనించారన్నారు.సికింద్రాబాద్ లో కిషన్ రెడ్డికి బీసీల ఓట్లు ఇక పడవని వేయద్దని చెప్తానన్నారు. రాష్ట్రమంతా తిరిగి బీసీ వ్యతిరేకి బీజేపీ అని ప్రచారం చేస్తానన్నారు.

# సంతృప్తినిచ్చిన సంవత్సర పాలన :మంత్రి వివేక్



**హైదరాబాద్, (మెట్రో న్యూస్ ):** మంత్రిగా ఏడాది పాలన ఎంతో సంతృప్తి ఇచ్చిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు.రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు భూగర్భ వన రుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రి పదవిలో ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.తన శాఖల పనితీరు, ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై ఆయన వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత ఏడాది కాలంగా ప్రజా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యం గా ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజ లకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, తెలంగాణ అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభు త్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వారికి సామాజిక భద్రత, బీమా, ఆరోగ్య రక్షణ కల్పించేలా ప్రత్యేక విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించామని, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తు న్నామని మంత్రి తెలిపారు.-ాండ్ మాఫియా కారణంగా పేదల ఇళ్ల నిర్మాణం ఆగిపోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇసుక సరఫరాలో పారదర్శకతను తీసుకువచ్చి ప్రతి అర్హులైన లబ్ధిదారునికి అందేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.చెన్నూర్ యు వతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కేం ద్రంలో నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించబడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏటీసీ కేంద్రాలు యువతకు ఉద్యోగ అవకాశాల గేట్వేలుగా మారనున్నాయని చెప్పారు.గత ఏడాది ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేసిందని, రాబోయే రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.కార్మిక శాఖ మంత్రి గా నాన్న కాక వెంకట స్వామి స్ఫూర్తి తో కార్మికుల కోసం పని చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి పదవి కట్టబెట్టిన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్, సీఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ కష్టాలకు త్రిమూర్తులు కారణం :విప్ ఎన్నం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ లే తెలంగాణ ప్రజల కష్టాలకు కారణమని ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం సీఎల్పిలొ ఆయన మీడియా తో మాట్లాడారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని హరీష్ రావు, కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నార న్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై వీరు చెప్పే అబద్ధాలు చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదన్నారు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కన పెట్టి లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు తెచ్చారని ఆ ప్రాజెక్టు వల్ల భవిష్యత్ తరాలకు అప్పులే మిగిలాయన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఉపయోగం కంటే భారం ఎక్కువగా మారిందని తెలిపారు. గోదావరి ఫేజ్1, కృష్ణా ఫేజ్3 ప్రాజెక్టులే దానికి కారణంగా చెప్పారు గత 9.5 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క అదనపు ఎంజైడ్ నీరు కూడా తీసుకరాలేకపోయారన్నారు మూసి పునరుజ్జీవం, గోదావరి నీటి ప్రాజెక్టులు చేస్తుంటే వారు అడ్డుకుంటున్నారని తెలిపారు గోదా వరి నీటిని హిమాయత్ సాగర్, గండిపేట, మూసి నదిలో కలపాలని మా ప్రభుత్వ ప్రణాళిక అని దీనివల్ల హైదరాబాద్‌కు స్థిరమైన మంచినీటి సరఫరా వస్తుందన్నారు.

# స్టాఫ్ ఆఫీసర్స్‌తో డీజీపీ సి.వి. ఆనంద్ సమావేశం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ డీజీపీ కార్యాలయంలో స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనరేట్ల పరిధులు, పోలీస్ స్టేషన్ల లిమిట్లు, సరిహద్దు గ్రామాల విభజన, జ్యూరిస్డిక్షన్ సంబంధిత అంశాలపై సంబంధిత కమిషనర్లతో విస్తృతంగా చర్చించారు. సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు అన్ని శాఖలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులు గృహ సేవకులుగా పనిచేస్తూ కొన్ని నేరాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా డొమెస్టిక్ సర్వెంట్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని డీజీపీ ఆదేశించారు. వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారు అనే సమాచారాన్ని డేటాబేస్ రూపంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.సమావేశంలో సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, సీఐడీ వ్యవస్థ బలోపేతం, మాన్యువల్ ప్రక్రియల ఆధునీకరణ, భవిష్యత్ కార్యాచరణలపై కూడా చర్చించారు. నవంబర్ నెలలో పోలీస్ ట్రిట్ నిర్వహణతో పాటు అక్టోబర్‌లో మహిళా పోలీస్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. మహిళా పోలీసులకు 33 శాతం రిజర్వేషన్ సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, లా అండ్ ఆర్డర్, ఫీల్డ్ డ్యూటీలలో మరింత అవకాశాలు కల్పించాలని సూచించారు. సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలిపోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, టీజీ కాప్స్ వ్యవస్థ వినియోగంపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా డయల్-100, రౌడీ షీటర్లు, వాహనాల సెర్చింగ్, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్స్, హెచ్ఆర్ఎంఎస్, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్ టెక్నాలజీ అనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీజీపీతో పాటుగా హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్,ఇంటెలిజెన్స్ డిజి విజయ్ కుమార్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్, టి జి టెక్నికల్ సర్వీసెస్ డి జి వి వి శ్రీనివాస రావు, హైదరాబాద్ కమిషనర్ సజ్జనర్, ఆక్టోపస్ డీజీ అనిల్ కుమార్, హోమ్ గార్డ్స్ డీజీ స్వాతి లక్రా, మల్టి జోన్ - చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ ఐ జి రమేష్ నాయుడు, ఐ జి పి & ఎల్ గజరావు భూపాల్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ ఎం రమేష్ రెడ్డి, మల్కాజ్గిరి కమిషనర్ సుమతి తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు సహకరిస్తా



**● ఇటీకాల ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి**

**● ముకునూరు గ్రామానికి ఉచితంగా ఫాగింగ్ మిషన్ అందజేసిన సత్యనారాయణ రెడ్డి**

**మెట్రో న్యూస్,ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ముక్కునూరు గ్రామానికి వర్షాకాలంలో దోమల బెడద లేకుండా ఉండేందుకు ముకునూరు గ్రామపంచాయతీకి తాను స్వతహాగా ఉచితంగా ఇటికల ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పంచాయతీ సిబ్బంది సమక్షంలో అందజేశారు.ముకునూరు గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది,అధికారులు సత్యనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతూ.... ఇప్పటికే గ్రామానికి అన్ని విధాల సహకరిస్తూ గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో నిధులు స్వతహాగా వెచ్చిస్తూ, ఉచిత వైద్య శిబిరాలు గ్రామస్తులకు అనేక విధాలుగా సహకరిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సత్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో అభివృద్ధి చెందాలని అనేక కళాత్మక సాంస్కృతి కార్యక్రమాలు గ్రామంలో సతహాగా నిర్వహిస్తున్నానని, అదేవిధంగా యువతకు అవసరమైన క్రీడా విభాగానికి సంబంధించి తనవంతుగా సహాయం అందిస్తున్నానని, ముఖ్యంగా ఆరోగ్యపరంగా గ్రామస్తులకు కంటి, ఇతర వ్యాధులకు ఆరోగ్య శిబిరాలు వంటివి నిర్వహిస్తున్నానని, భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలతో ఫౌండేషన్ సహకారంతో చేస్తానని, గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సర్పంచ్ సన్నాయిల శిల్ప ప్రేమ కర్ ఎంపీవో అధికారి ఉష కిరణ్,పంచాయతీ సెక్రటరీ ఆకుల వీణ పంచాయతీ సిబ్బంది పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలవి రాజకీయ విమర్శలు :మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ఒకరు విదేశాలు, మరొకరు జిల్లాలు తిరుగుతు కేటీఆర్, హరీష్ రావులు రాజకీయ విమర్శలు చేస్తున్నారని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు, సోమవారం సీఎల్పిలొ ఆయన మీడియాతో మాట్లాడారు.చిరంజీవి హీరోగా హిట్లర్ అనే సినిమా వచ్చిందని హిట్లర్ సినిమా ప్రధాన ఉద్దేశం వేరని ఆయన పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్దానికి కారణమైన హిట్లర్ నియంత.ఆయన వేరు జనభావుల్యంలో ఉన్న హిట్లర్ పేరు వేరన్నారు.ఏదైనా పని చేపడితే దాన్ని ఎలాగైనా సాధించే వారిని హిట్లర్ అంటారని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఒక లక్ష్యం, క్రమశిక్షణతో పోవాలని హిట్లర్ అనే పదాన్ని వాడారని తెలిపారు. దాన్ని నాజీ హిట్లర్ తో పోల్చడం సరికాదని హిట్లర్ పాటించిన సిద్ధాంతాలను పాటిస్తామని ముఖ్యమంత్రి చెప్పలేదన్నారు చెరువులను కబ్జా దారులనుంచి కాపాడాలంటే ఒక ఉక్కు సంకల్పం అవసరమని ఆ ఉక్కు సంకల్పం గురించి చెప్పడానికి హిట్లర్ అనే పదం వాడారన్నారు.తాపీ మేస్త్రీకి తలపోటు వస్తే గోడ కూల్చినట్లు కేటీఆర్ వ్యవహారశైలి ఉందని ఆయన ఏద్దేవా చేశారు.హిట్లర్ అనే పదం ముఖ్యమంత్రి మాట్లాడిన సందర్భం వేరన్నారు కబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే ఓర్వలేక ఏం మాట్లాడో తెలియక కొందరు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని తెలిపారు.కేసీఆర్, కేటీఆర్ ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడటం అంటే గురువింద గింజ తన కింద నలుపు ఎరుగనట్లేనని తెలిపారు.కేటీఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడం అంటే శతాబ్దపు జోకవుతుందని తెలిపారు.పదేళ్ల పాటు కేసీఆర్ సెక్రటేరియట్‌కు రాలేదని ప్రగతి భవన్ కు ఎవరిని రానివ్వలేదని స్వయంగా మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు కూడా రానివ్వలేదని ఆయన గుర్తు చేశారు.నాజీలు పెట్టిన హిట్లర్ బంకర్ లా ప్రగతి భవన్ ఉండేదని వాటిని తొలగించామని తెలిపారు.

# టెక్నాలజీతో పోలీసింగ్ మరింత బలోపేతం : డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, (మెట్రో న్యూస్ ):** రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందంజలో నిలిచిందని, అయితే ఇటీవలి కాలంలో అందుబాటులో ఉన్న టెక్నాలజీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం, క్షేత్ర స్థాయిలో అమలులో లోపాలు ఉండటం వల్ల కొన్ని అంశాల్లో వెనుకబడిన పరిస్థితులు ఏర్పడ్డాయని రాష్ట్ర డీజీపీ సి పి ఆనంద్ తెలిపారు.అన్ని యూనిట్ అధికారులతో పాటు ఎస్హెచ్ఓ లతో డిజిపి కార్యాలయంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగించి, డేటా ఆధారిత పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.డీజీపీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి వివిధ పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ మాట్లాడుతూ, టెక్నాలజీ అనేది కేవలం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధితో మాత్రమే పరిమితం కాకుండా వాటిని సమర్థవంతంగా వినియోగించడం, సమాచార సవరణ, రియల్ టైమ్ డేటా నిర్వహణపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న డిజిటల్ పోలీసింగ్ అప్లికేషన్లు, టీజీ కాప్ యాప్స్, ఇతర సాంకేతిక వేదికల అభివృద్ధి, వాటి అమలులో ఎదురవుతున్నసవాళ్లు, క్షేత్ర స్థాయి సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వ్యవస్థలను రూపొందించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత ముఖ్యమని తెలిపారు. టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు నేర పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. సీసీటీఎన్ఎస్, ఎన్సీఆర్బీ రిపోర్టులు, ఎన్టీఆర్ ఫోటో డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను నిరంతరం అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పలు అప్లికేషన్లు, ఫిట్‌నెస్ ఎగ్జామినేషన్ మాడ్యూల్స్, సీడీ పార్ట్ అవర్స్ వంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో వినియోగించబడటం లేదని అన్నారు.ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌ఓలు కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమయానికి సిస్టమ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎఫ్ఐఆర్‌లు, క్రైమ్ వివరాలు, సీడీ పార్ట్స్, 41 సీఆర్‌పీసీ ప్రక్రియలు, అరెస్ట్ వివరాలు, ఫామ్-54, సైంటిఫిక్ ఎవిడెన్స్, చార్జ్‌షీట్లు వంటి అంశాలను నిర్దిష్ట సమయంలో అప్‌డేట్ చేయడం ద్వారా డేటా ఆధారిత పోలీసింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగిస్తే క్రైమ్ అనాలిసిస్, మంత్లీ క్రైమ్ రివ్యూలు, ట్రెండ్ స్టడీస్, కేసుల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని డీజీపీ పేర్కొన్నారు.దేశంలో టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాల్లో రాష్ట్ర పోలీస్ శాఖ గతంలో అనేక రంగాల్లో ముందంజలో నిలిచిందని, ప్రస్తుతం ఉన్న వ్యవస్థలను సమర్థంగా అప్‌డేట్ చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తే మళ్లీ దేశంలో అగ్రస్థానంలో నిలిచే అవకాశం ఉందని డీజీపీ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, డీజీ ఆర్గనైజేషన్ స్వాతి లక్రా తదితర ఉన్నతాధికారులు, జిల్లా పోలీస్ అధికారులు, సాంకేతిక విభాగ అధికారులతో పాటు వివిధ యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న ఇండియా, పాక్ : ఎస్ఐపీఆర్ఐ రిపోర్టు

ఇంటర్నెట్ డెస్క్: 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్‌టట్యూట్(ఎస్ఐపీఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వారహెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది.



# రాష్ట్ర బీజేపీకి అగ్ని పరీక్ష

- ఎన్వీ సుభాష్‌పై ఫిర్యాదులు!
- ఈటలపై పోస్టర్‌లు! బండి కుమారుడి వివాదం!
- సీఎం రేవంత్ జూన్ 15 హెచ్చరిక!



హైదరాబాద్ (మెట్రో న్యూస్): నిరంతరం ఏదో ఒక సమస్యతో వార్తల్లో కెక్కుతుంది తెలంగాణ బీజేపీ.రాష్టంలో అధికారం సాధించడమే లక్ష్యంగా బీజేపీ కేంద్ర నాయకత్వం అడుగులు వేస్తున్నప్పటికి తెలంగాణ బీజేపీ నాయకుల వల్ల ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా మారుతోంది ఆ పార్టీ పరిస్థితి.గడ్డు రాష్టాల్లో అధికారం కైవసం చేసుకున్న బీజేపీ కేంద్ర నాయకత్వానికి తెలంగాణ రాష్టంలో అధికారం పొందడం ఒక అగ్ని పరీక్ష గా మారింది. కాంగ్రెస్ లోని ఒక వర్గాన్ని మచ్చిక చేసుకొనే ప్రయత్నం చేస్తూనే ప్రతిపక్షం బీఆర్ఎస్ ను దెబ్బ కొట్టేలా వ్యూహం రచిస్తున్న కేంద్ర నాయకత్వానికి అంతంత మాత్రంగా ఉన్న బీజేపీ నాయకుల్లో నెలకొన్న వివాదాలు, అంతర్గత విభేదాలతో నాయకత్వ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా మారుతోంది. జీహెచ్ఎమ్సీ ఎన్నికలు మొదలు పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దడ పుట్టించింది.ఎన్నికలు పూర్తయి కొంత కాలం పాటు సజావుగా ఉన్న బీజేపీ లో లుక లుకలు మొదలయ్యాయి. బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ ను తొలగించి, కొన్నాళ్ళ నిరీక్షణ తరువాత అనూహ్యంగా ఎన్ రాంచందర్ రావు నియామకం తో కమలం పార్టీ లో మొదలైన కలహాలు పార్టీ అభివృద్ధి ఏమో కానీ ప్రజల్లో పార్టీ కార్యకర్తల్లో మాత్రం పలుచన అయింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో నిధుల గోల్ మాల్ అంటూ విమర్శలు రాగా ఆ తరువాత ఎన్ రాంచందర్ రావు కార్యవర్గ కూర్పు పార్టీ లో మరింత కలవరానికి గురిచేసింది.కార్యవర్గం లోకి కొత్త మొఖాలను తెర పైకి తెచ్చినా ఫలితం లేకపోయింది. బీజేపీ అధ్యక్షులు గా నియామకం అయిన రాంచందర్ రావు మొదట్లో జిల్లాల పర్యటన జరిపిన సమయంలో గ్రూప్ లు బహిర్గతం అయ్యాయి. పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ వ్యవహారం కూడా పార్టీకి విపత్కర పరిణామంగా సంబవించిందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఆయన పై కేంద్ర పార్టీకి, పీఎం మోడీ కి ఫిర్యాదు లు వెళ్లిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఆ తదుపరి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై పొక్సో కేసు ద్వారా తెలంగాణ బీజేపీ మరోసారి వార్త ల్లో కెక్కింది. పార్టీ కి మచ్చగా మారిన భగీరథ్ వ్యవహారం లొ అతి చేసిన బీఆర్ఎస్ నాయకులకు బీజేపీ నాయకులు కొందరు ఉప్పందించారనే ఆరోపణలు వినవచ్చాయి.బీజేపీ చీఫ్ రాంచందర్ రావు కు సన్నిహితుడనని చెప్పుకునే ఓ అగ్రవర్ణ నాయకుడు ఉప్పందించడంలో కీలక పాత్ర పోషించాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత మంది బీజేపీ నాయకులు పార్టీ కార్యక్రమం అంటూ పెద్ద ఎత్తున దండుకుంటున్నారనే వార్తలు వస్తున్నాయి. రాంచందర్ రావు నెత్రుత్వంలోని రాష్ట్ర కమిటీ లోని ముగ్గురు నాయకులు వసూల్ రాజా లుగా మారిపోయారని తెలుస్తోంది. పప్పులో ఉప్పులా ఇందులో కూడా పలు ఫిర్యాదులు ఎదురు కుంటున్న నాయకుడి హస్తం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల పై వెలసిన పోస్టర్ లు పార్టీలో వివాదస్పద మయ్యాయి. ఆయనను నేరుగా విమర్శలు చేస్తూ వేసిన పోస్టర్ ల వెనుక ఎవరున్నారనేది తేట తెల్లం కావడంతో పార్టీ నాయకులకు మింగుడు పడని అంశంగా మారింది. ఇందుకు సంబంధించి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు రామక్రిష్ణ ను బాద్యుడిని చేస్తూ పార్టీ సస్పెండ్ చేసింది.సీఎం రేవంత్ రెడ్డి కూడా నేరుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని టార్గెట్ చేశారు. కిషన్ రెడ్డి బీజేపీ లొ ఉన్నా బీఆర్ఎస్ కు పనిచేస్తారని నిన్నటి సభలో పేర్కొన్నారు. 15తరువాత బీజేపీ తో పాటు కిషన్ రెడ్డి భరతం పడతామని కూడా డెడ్ లైన్ విధించారు.ఏది ఏమైనా అధికార కాంగ్రెస్ ను, ప్రతిపక్ష బీఆర్ఎస్ ను ఎదుర్కోవడం మాట అటుంచితే పార్టీ అంతర్గత కుమ్ములాటలు చక్కదిద్దుకోవడం పార్టీకి పెద్ద సవాల్ గా మారిందని చెప్పవచ్చు.



## పశ్చిమాసియా టెన్షన్..

## భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా బలహీన సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ముడిచమురు ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ కీలక సూచీలు 1 శాతానికి పైగా పతనమయ్యాయి.

ఈ ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోయి 73,421 వద్ద ట్రేడ్ అయింది. అలాగే, నిఫ్టీ కూడా 286 పాయింట్లు కోల్పోయి 23,080 వద్దకు జారుకుంది. దాదాపు అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. రియల్టీ సూచీ దాదాపు 2 శాతం పడిపోగా, మెటల్, ఆటో, ఐటీ సూచీలు 1 శాతానికి పైగా నష్టాలను చవిచూశాయి.



## గాలివాన బీభత్సం..

## ఎయిర్‌పోర్ట్‌లో విమానాలను ఢీకొన్న సపోర్టింగ్ పరికరాలు

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయం లో బలమైన గాలులు, వర్షం కారణంగా గందరగోళం నెలకొంది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించడంతో ఎయిర్పోర్ట్ టెర్మినల్ 2లో నిలిపిఉంచిన ఎయిర్ ఇండియాకు చెందిన మూడు విమానాలను గ్రౌండ్ సపోర్ట్ పరికరాలు ఢీకొట్టినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఆ విమానాలకు మరమ్మతులు చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.

## నాంపల్లిలో చేప ప్రసాదానికి భారీ ఏర్పాట్లు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్: చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రా(ష్టాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు.

చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

## ఫిలిప్పీన్స్‌ను వణికించిన | భారీ భూకంపం



ఇంటర్నెట్ డెస్క్: ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతాన్ని సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రతో భూమి కంపించింది. మిండనావో ద్వీపానికి సమీపంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లుగా జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ వెల్లడించింది. భూకంప కేంద్రం భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఉండటంతో తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయని తెలిపింది. దీని ప్రభావం కారణంగా ఫిలిప్పీన్స్‌తో పాటు ఇండోనేషియా,మలేసియా తదితర దేశాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు.తీర ప్రాంత ప్రజలు వెంటనే ఎత్తయిన ప్రాంతాలకు తరలిపోవాలని ఫిలిప్పీన్స్ అగ్నిపర్వతాలు, భూకంపాల పరిశోధనా సంస్థ (ఫివోల్క్స్) హెచ్చరించింది. సాధారణ సముద్ర మట్టానికి మీటర్ కంటు ఎక్కువ ఎత్తులో అలలు ఎగిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో మూడు కిలోమీటర్ల ఎత్తు వరకు సునామీ అలలు వచ్చే అవకాశం ఉందని పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ తెలిపింది.

### పలు దేశాలకు సునామీ హెచ్చరికలు

# ఇరాన్‌కు వెళ్లొద్దు

### ఆ దేశంలో ఉన్నవారు వెంటనే వచ్చేయండి భారతీయులకు కేంద్రం సూచన

ఇంటర్నెట్ డెస్క్:పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందు బాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నాం అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది.



ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని,ఇజ్రాయెల్,దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

## నీట్ రీ-ఎగ్జామ్: లాక్‌డౌన్‌లో పేపర్ రూపకర్తలు!

ఇంటర్నెట్ డెస్క్: నీట్ యూజీ రీ-ఎగ్జామ్ కోసం అధికారులు మునుపెన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాద ప్రక్రియల్లో పాల్గొనే నిపుణులందరినీ జూన్ 21 వరకు ఓ రహస్య ప్రాంతంలో గృహనిర్బంధం (లాక్‌డౌన్)లో ఉంచారు. గత నెలలో జరిగిన పరీక్ష పేపర్ లీక్ వివాదాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకుంది.ప్రశ్నపత్రాలు తయారు చేసే నిపుణులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా కట్ చేశారు. వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచ్‌లను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వారు ఉంటున్న రహస్య కేంద్రంలో ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. ఆ కేంద్రంలోకి ఎవరికీ అనుమతి లేదు. లోపలికి వెళ్లి వచ్చే ప్రతి ఒక్కరి కదలికలను అధికారులు నిరంతరం రికార్డు చేస్తున్నారుఈ ఐసోలేషన్ ప్రక్రియ భద్రతా వలయంలో కేవలం మొదటి అంచె మాత్రమేనని అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రాల తయారీ, ప్రింటింగ్, ప్యాకేజింగ్, రవాణా వరకు ప్రతి దశను అత్యంత కఠినంగా పర్యవేక్షిస్తున్నారు.

## విదేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించేందుకు యత్నిస్తున్నా



హైదరాబాద్: నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.గతంలో రూ. 1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్స్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ. 1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

కృషితోనాస్తి దుర్భిక్షం
మెట్రో ఈవినింగ్స్
4, హైదరాబాద్ మంగళవారం జూన్ 09, 2026

# యాసంగి వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు.. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో తెలంగాణ

2025-26 యాసంగి (రబీ) సీజన్‌లో వరి సాగుతో పాటు ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగ్గా.. ఇది దేశం మొత్తం యాసంగి సాగు విస్తీర్ణంలో సగానికి పైగా ఉండటం విశేషం. ఖరీఫ్, రబీ రెండు సీజన్లను కలిపి చూస్తే అత్యధిక సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే 72.30 లక్షల టన్నులకు చేరగా.. త్వరలోనే 75 లక్షల టన్నుల మార్కును దాటనుంది. ప్రభుత్వ ఉచిత విద్యుత్, సన్న బియ్యానికి బోనస్, రైతుభరోసా వంటి పథకాలే ఈ విజయానికి ప్రధాన కారణమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణంలో, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ప్రణాళికశాఖ నివేదిక స్పష్టం చేసింది. సాధారణంగా నీటి కొరత కారణంగా దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో వానాకాలం (ఖరీఫ్)తో పోలిస్తే యాసంగిలో వరి సాగు చాలా తక్కువగా ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద జరిగిన యాసంగి వరి సాగు విస్తీర్ణంలో సగానికి పైగా వాటా కేవలం తెలంగాణదే కావడం విశేషం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో 30.76 లక్షల ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 17.29 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇక వానాకాలం, యాసంగి రెండు సీజన్లను కలిపి చూస్తే.. అత్యధిక సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.

## //ఎడిటోరియల్//

వరి సాగులోనే కాకుండా ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. శనివారం నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళు 72.30 లక్షల టన్నులకు చేరాయి. కొనుగోళ్లు మరో వారం పాటు సాగనుండటంతో ఈ సంఖ్య సులభంగా 75 లక్షల టన్నుల మార్కును దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. మన పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మొత్తం కొనుగోళ్లు కలిపినా 40 లక్షల టన్నుల లోపే ఉండటం గమనార్హం. తెలంగాణలో ఈ స్థాయి దిగుబడి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రాజెక్టుల ద్వారా నిరంతర నీటి లభ్యత, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 అదనపు బోనస్ అందించటం, పకడ్బందీగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కారణంగా సాగు విస్తీర్ణం పెరిగిందని అంటున్నారు. గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది వానాకాలంలో 69.90 లక్షల ఎకరాలు, యాసంగిలో 59.90 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ రెండు సీజన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 282 లక్షల టన్నుల భారీ ధాన్యం దిగుబడి వచ్చినట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ అనుకూల విధానాల వల్లే తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారిందని నిపుణులు కొనియాడుతున్నారు.

## హిత శత్రువుహిత శత్రువు

మెట్రో డైలీ

మగాడు సంపాదిస్తేనే..
సమాజం గౌరవిస్తుంది
ఆడది అనుకువగా ఉంటేనే..
ఊరు వాడ అభిమానం కురిపిస్తుంది
ఎవరి పాత్ర వారు నిర్వహించాల్సిందే !
జరిగేవన్నీ అనుకూలంగా..
ఉంటాయనే గ్యారంటీ లేదు
నేడు వాస్తవం, రేపు ఓ ఆశ..
చేయవలసినవి నేడే పూర్తి చేయ్
రేపు ఉంటామో లేదో తెలియదు !
పువ్వుల రంగులు సైజులు వేరు..
ప్రతి పువ్వు సగర్వంగా పూస్తుంది
దేని ప్రాధాన్యత దానిదే మరి..
మనుషులు కూడా అంతే..
ఎవరి ప్రత్యేకత వారిది మిత్రమా !
సిగరెట్ ఆరోగ్యానికి హానికరమే..
స్మార్ట్‌ఫోన్ అంతకన్న ఎక్కువ మరి..
చరవాణి ఏకాగ్రత, నిద్ర, బంధాలను..
మింగేస్తున్న మన చేతుల్లో హిత శత్రువు
మన దేహంలో అంగమై తిష్ట వేసింది !
మాటలతో మనసుల్ని గెలిచేటోళ్లు..
పరహిత చేతలతో శ్రేయస్సు కోరేటోళ్లు..
సదాలోచనలతో లోక కళ్యాణం కోరేచోళ్లు..
సువిజ్ఞానాన్ని నిస్వార్థంగా పంచేటోళ్లు..
నైతిక విలువలను శ్వాసించేటోళ్లు..
నవ సమాజ నిర్మాతలుగా వెలుగుతారు !

మధుపాళీ 9949700037

# మెదడు కణితి సమస్య ప్రమాదకరం,ప్రాణాంతకం!

## మెట్రో తెలంగాణ చావడి







ప్రపంచవ్యాప్తంగా 08 జూన్ రోజున "ప్రపంచ మెదడు కణితి దినం (వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే)" పాటించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభమైంది. మెదడు కణితి లేదా బ్రెయిన్ ట్యూమర్ లేదా లంప్స్ లేదా గడ్డల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిగ్రస్థులకు భరోసా ఇవ్వడం నిరంతరం కొనసాగాలి. ప్రపంచ మెదడు కణితి దినం-2026 ఇతివృత్తంగా "వ్యాధిని ముందస్తుగా గుర్తించడం పట్ల అవగాహన, రోగ నిర్ధారణలో ఉన్న అంతరాన్ని తగ్గించడం" అనే అంశంపై అవగాహన కల్పించడం జరుగుతోంది. 2019 అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 3.40 లక్షల మెదడు కణితి రోగులు, 2.27 లక్షల బ్రెయిన్ ట్యూమర్ కారం మరణాలు నమోదు అయ్యాయి. భారత్‌లో సాలీనా దాదాపు 28,000 కేసులు, 24,000 మరణాలు జరుగుతున్నాయి. భారత్‌లో 2 శాతం వరకు మెదడు కణితి సమస్యలు వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. కేంద్ర నాడీ మండల సమస్యగా గుర్తించబడిన బ్రెయిన్ ట్యూమర్ సమస్యలు రాకుండా జాగ్రత్త పడడంలో తరుచుగా పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమైన మార్గమని గమనించాలి. నినిబ్రెయిన్ ట్యూమర్‌కు ప్రధాన కారణాలు: మెదడులోని ఏదో ఒక భాగంలో అసాధారణంగా కణజాలం పెరగడంతో కణితులు లేదా ట్యూమర్స్ ఏర్పడి తీవ్ర సమస్యగా ఉత్పన్నం అవుతుంది. మెదడు కణితి సమస్యలకు స్పష్టమైన కారణాలు ఏమీ ఊహించలేము. అనువంశిక, రేడియో (ఎక్స్ కిరణాలు) కిరణాలు సోకడం, పురుగు మందులకు గురి కావడం, ప్రమాదకర రసాయనాల సమీపాన పని చేయడం లాంటి కారణాల వల్ల మెదడు కణితి సమస్యలు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్ని వయస్సుల వారికి మెదడు కణితి సమస్యలు రావచ్చని, 10 ఏండ్ల లోపు పిల్లలు, 50 ఏండ్లకు పైబడిన వయోజనులకు ఈ సమస్య ఎక్కువగా రావచ్చు మెదడు కణితి సమస్య వల్ల 9 - 12 మాసాల్లో మరణం సంభవించవచ్చని, కొద్ది రోగులు మాత్రమే 3 ఏండ్ల వరకు బతకవచ్చని తేలింది. నినిమెదడు కణితి రోగ లక్షణాలు - చికిత్సా మార్గాలు : బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి లక్షణాల్లో తీవ్రమైన తలనొప్పి, వణకడం, వాంతులు, జ్ఞాపకశక్తి సమస్యలు, నీరసం, మూర్ఛలు, నిలబడలేక పోవడం, నడకలో ఇబ్బందులు, మాటలో తత్తరపాటు, మింగడంలో సమస్యలు, దృష్టి సమస్యలు లాంటివి కనిపిస్తాయి. మెదడు కణితి గుర్తించడంలో ఎంఆర్ఐ, సిటి స్కాన్, సెరిబ్రల్ ఆంజియోగ్రామ్‌లను వాడతారు. కణితుల పరిమాణం, గ్రేడ్, దశ, లొకేషన్, స్వభావాలను బట్టి వైద్యం అందిస్తారు. రేడియోషన్, కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ, స్టీరాయిడ్స్ వాడకం, మెదడులోని అదనపు ద్రవాలను తొలగించడం లాంటి చికిత్సలు చేస్తారు. శస్త్రచికిత్స ద్వారా కణితిని తొలగించే అవకాశం కూడా ఉంటుంది. కణితులు ముదిరితే జీవితకాలాన్ని కొంత వరకు పెంచవచ్చని, పూర్తి చికిత్సకు అవకాశం లేదని తెలుసుకోవాలి. మనసుకు, దేహానికి వారధిగా పని చేస్తున్న మెదడును తరుచుగా పరీక్షలు చేయించుకుంటూ చురుకైన, సరళమైన, మంచి అలవాట్లు కలిగిన జీవన విధానాన్ని అలవర్చుకుందాం, ఆరోగ్యంగా కొనసాగుదాం.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# ఏడాదిలో ఒక్కసారే తెరుచుకునే శివాలయం.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి, కొట్టియూర్ ఆలయం







దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కొట్టియూర్ మహాదేవ ఆలయం తెరుచుకుంది. ఏడాదిలో కొన్ని రోజులు మాత్రమే దర్శనం ఇచ్చే ఈ ఆలయం ఇప్పుడు భక్తులకు అందుబాటులోకి వచ్చింది. దట్టమైన అడవులు, నదిని దాటుకుంటూ చేసే ఈ ఆధ్యాత్మిక సాహస యాత్ర.. భక్తులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ప్రకృతి, ఆధ్యాత్మికత, శతాబ్దాల సంప్రదాయాల కలయికగా కొట్టియూర్ ఆలయం ప్రత్యేక గుర్తింపు పొందింది.

కొట్టియూర్ మహదేవ ఆలయం. కేరళలోని కన్నూర్ జిల్లాలో దట్టమైన అడవుల మధ్య కొలువైన గుడి. దేశంలోనే అత్యంత విశిష్ఠమైన శైవక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిందిన ఈ కొట్టియూర్ మహదేవ ఆలయాన్ని.. దక్షిణ కాశీగా పిలుస్తారు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే తెరుచుకునే ఈ ఆలయాన్ని చేరుకోవాలంటే.. అడవులు, నది మీదుగా ఆధ్యాత్మిక యాత్ర చేపట్టాల్సి ఉంటుంది. ప్రకృతితోపాటు.. పురాణాలు, శతాబ్దాల నాటి సంప్రదాయాల సమ్మేళనంగా భావించే ఈ క్షేత్రాన్ని.. ఏటా లక్షలాది మంది భక్తులు సందర్శిస్తూ ఉంటారు. అడవి మధ్యలో, నది దాటి చేరాల్సిన ఈ కొట్టియూర్ మహదేవ ఆలయ యాత్ర భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.

ఏడాదిలో ఒక్కసారి మాత్రమే వైశాఖ మహోత్సవం సందర్భంగా ఈ అక్కరే కొట్టియూర్ ఆలయం తెరుస్తారు. ఈ ఏడాదిలో మే 23వ తేదీన ప్రారంభమైన ఈ మహోత్సవం.. జూన్ 24వ తేదీ వరకు జరగనుంది. దక్ష యజ్ఞానికి సంబంధించిన పురాణ గాథలతో ముడిపడిన ఈ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా భక్తులు బావలి నదిని దాటి ఆ ఆలయానికి చేరుకుంటారు. కొట్టియూర్‌లో రెండు వేర్వేరు ఆలయాలు ఉన్నాయి. ఇక్కరే కొట్టియూర్ అనే శాశ్వత ఆలయం ఏడాది పొడవునా తెరిచి ఉండగా.. అయితే వార్షిక ఉత్సవాల సమయంలో ప్రధాన కేంద్రంగా మారేది బావలి నదికి అవతల ఉన్న అక్కరే కొట్టియూర్ ఆలయం.

ఈ అక్కరే కొట్టియూర్ ఆలయానికి శాశ్వత నిర్మాణం ఉండదు. ప్రతి సంవత్సరం ఉత్సవాల కోసం మాత్రమే తాత్కాలికంగా నిర్మించి.. ఉత్సవాలు ముగిసిన తర్వాత తొలగిస్తారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కారణంగా కొట్టియూర్ ప్రత్యేకతగా నిలిచింది. పరమశివుడికి సంబంధించిన పవిత్ర స్థలంగా భావించే ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు.

హిందూ పురాణాల ప్రకారం.. దక్ష ప్రజాపతి తన అల్లుడు పరమశివుడిని ఆహ్వానించకుండా నిర్వహించిన మహాయజ్ఞం ఈ కొట్టియూర్ ఆలయం వద్దే జరిగినట్లు విశ్వసిస్తారు. శివుడిని అవమానించినందుకు బాధతో సతీదేవి యజ్ఞాగ్నిలో ఆత్మాహుతి చేసుకుందని.. ఆ తర్వాత తీవ్రంగా ఆగ్రహించిన శివుడు యజ్ఞాన్ని ధ్వంసం చేశాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఘటనలకు గుర్తుగా ప్రతి సంవత్సరం నిర్వహించే వైశాఖ మహోత్సవం దక్షిణ భారతదేశంలో అత్యంత పవిత్రమైన శైవ యాత్రలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

2026 సంవత్సరానికి కొట్టియూర్ వైశాఖ మహోత్సవం మే 23వ తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు మొత్తం 28 రోజుల పాటు జరగనుంది. మే 23వ తేదీన నీరెళున్నల్లాత్తు (ఉత్సవ ప్రారంభం).. మే 28 నెయ్యాట్టం.. మే 29 భండారం ఎజున్నాల్లతు.. జూన్ 7 ఎలనీర్ వాయ్పు.. జూన్ 8 ఎలనీరట్టం.. జూన్ 14 రోహిణి ఆరాధన.. జూన్ 20 మాకం కాలం వరవు.. జూన్ 24 త్రిక్కలశాట్టుతో మహోత్సవంతో ముగింపు పలకనున్నారు.

కొట్టియూర్ యాత్ర ఎలా ఉంటుంది?

సాధారణ ఆలయ కంటే కొట్టియూర్ యాత్ర పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అక్కరే కొట్టియూర్ చేరుకోవడానికి భక్తులు బావళి నదిని దాటాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల చెప్పులు లేకుండా నడవాల్సి వస్తుంది. అడవులు, బురద, నది ప్రవాహం మధ్య జరిగే ఈ యాత్ర భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది. వర్షాకాల ప్రారంభంతో కలిసివచ్చే ఈ ఉత్సవ కాలం కారణంగా భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ సంఖ్యలో భక్తుల రద్దీకి తోడు.. దర్శనానికి ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావడం.. వర్షాలు, బురద మార్గాలు.. కొన్ని ప్రాంతాల్లో పరిమిత సౌకర్యాలు.. ఎక్కువ దూరం నడవాల్సిన పరిస్థితులు ఉంటాయి.

ఆలయానికి ఎలా చేరుకోవాలి?

కొట్టియూర్ ఆలయానికి చేరుకునేందుకు.. రోడ్డు, రైలు, విమాన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. కొట్టియూర్‌కు సమీపంలోని కన్నూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంటుంది. ఇది ఆలయానికి సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక ఆలయానికి సమీపంలో తలస్సేరి, కన్నూరు ప్రధాన రైల్వే స్టేషన్లు ఉన్నాయి. కన్నూర్, ఇరిట్టి, మానంతవాడి నుంచి రోడ్డు మార్గంలో సులభంగా చేరుకోవచ్చు. ఉత్సవాల సమయంలో ప్రత్యేక బస్సులు కూడా నడుపుతారు. ఈ ఆలయంలో సంప్రదాయ దుస్తులకు ప్రాధాన్యం ఇస్తారు. పురుషులు ధోతీ.. మహిళలు చీర, సల్వార్ వంటి దుస్తులు ధరించాలని సూచిస్తారు. సంప్రదాయాల ప్రకారం 2026లో భండారం కార్యక్రమం పూర్తి అయిన తర్వాత.. అంటే మే 30వ తేదీ అర్ధరాత్రి నుంచి మహిళలకు అక్కరే కొట్టియూర్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఆలోపు మహిళలకు ప్రవేశం ఉండదు. మహోత్సవాన్ని ప్రకటించే అరుదైన పుష్పంకొట్టియూర్ ఉత్సవాలకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే మనతాన పువ్వు లేదా ముత్తప్పన్ పూ. కొట్టియూర్ పరిసర అటవీ ప్రాంతాల్లో పూసే ఈ అరుదైన అడవి పుష్పం వికసించడం ఉత్సవాల రాకకు గుర్తుగా భావిస్తారు.

మెట్రో ఈవెనింగ్స్ METRO EVENINGS
epaper.metroevenings.com
కరీంనగర్-వరంగల్
పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల | హన్మకొండ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్
తేది : మంగళవారం జూన్ 09 2026 పేజి నెం. : 5


# నక్ష సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నక్ష (నేషనల్ జియో స్పాషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబీటేషన్స్) సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు.

నక్ష సర్వే పురోగతి తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ మాట్లాడి.. సర్వే ఎక్కడి వరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నక్ష కింద దేశంలోని 150 అర్బన్ లోకల్ బాడీస్ ను ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు ఎంపిక చేశారని తెలిపారు. జూలై నెలాఖారులోగా మొత్తం సర్వే ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**పకడ్బందీగా పూర్తి చేయిస్తాం**

వేములవాడ మున్సిపల్ పరిధిలో నక్ష కార్యక్రమం కింద ఐదు విలీన గ్రామాల్లో కలిపి మొత్తం 307 బ్లాక్స్ ఉన్నాయని, ఇప్పటివరకు 49 పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 14, 984 ఇండ్లు ఉండగా, 6707 ఇండ్ల సర్వే పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క ఇంటి సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు పకడ్బందీగా పూర్తి చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, టీపీఓ అన్సార్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను వినియోగించుకోవాలి



చిగురుమామిడి: (మెట్రోన్యూస్)ప్రభుత్వ పాఠశాలను అర్హులైన విద్యార్థులందరు వినియోగించుకోవాలని బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలాడి లక్ష్మణరావు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులు గ్రామస్తులు విద్యార్థులతో కలిసి ఇంటింటా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో ఉపయోగకరమైన ఉచిత సేవలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు అనే తేడా లేకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంకట మౌనిక, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం విక్రమ్,బాల్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి,శ్యామయ్య, శంకర్,జ్యోత్స్న,చంద్రశేఖర్, రమాదేవి,కవిత,షర్మిల, జ్యోతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన పిన్ రెడ్డి రాంరెడ్డి

శంకరపట్నం మెట్రో న్యూస్: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగి పిన్ రెడ్డి రాంరెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది రాంరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూనె రమ-శ్రీనివాస్, ఉప సర్పంచ్ నూనె అశోక్, సొసైటీ డైరెక్టర్ కాటం బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ తాటికొండ సదానంద చారి, మాజీ ఎంపిటిసి మోతే భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు రెడ్డి మౌనిక, ఆడితం ఐలయ్య, మేడుదుల రాజు, పిన్ రెడ్డి సంపత్ రెడ్డి ( పెండ్యాల సంపత్ రెడ్డి) , మహేష్, ఆడితం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వండి



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 08, (మెట్రో న్యూస్) : పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50% రాయితీ కల్పించాలని జిల్లా జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) పక్షాన కోరారు. సోమవారం జిల్లా జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులైన జర్నలిస్టులు ప్రజావాణిలో, జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కు వినతి పత్రం అందజేశారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి: డిప్యూటీ మేయర్ ఎల్లయ్య



మెట్రో న్యూస్ రామగుండం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రామగుండం నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పలు డివిజన్ల క్లస్టర్ లెవెల్ వార్డు సభ సోమవారం ఎన్టీపీసీ కాకతీయ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని స్వచ్ఛంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులంతా ఉదయాన్నే వార్డుల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. అలాగే, పిల్లలు సెల్‌ఫోన్ల వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని పురస్కరించుకుని వరదలు రాకుండా కాలువల్లో పూడికతీత, రోడ్డు గుంతల పూడ్చివేత పనులు చేపట్టామన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. ఓటరు జాబితా మ్యాపింగ్‌ను జూన్ 15 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ముడుత రమేష్ ట్రాఫిక్ నిబంధనలపై, తహశీల్దార్ రవీందర్ ఓటరు సర్వేపై, వైద్యాధికారి అతుల్య అంటువ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రామచంద్రాపూర్ కాలనీలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన మేయర్



కరీంనగర్ బ్యూరో మెట్రో న్యూస్ కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీలో రూ.17 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రామచంద్రపూర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం రాకపోకలు సులభతరం కావడంతో పాటు స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు

## వార్డు సభల ద్వారానే పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యం

**- మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్**



మెట్రో ఈవినింగ్ జూన్ 8 నర్సంపేటలితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగాలినేడు నర్సంపేట పట్టణంలోని 8,17,19, 20 వార్డులలో ఏర్పాటు చేసిన వార్డు సభలకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ మరియు కమిషనర్ కాటం భాస్కర్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ..- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆనాడు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారు.. మరోసారి దరఖాస్తు చేసుకొనుటకై వార్డు సభల ద్వారా అవకాశం కల్పిస్తున్నామని.. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు..- ప్రతి ఒక్కరు పారిశుద్ధంపట్ల శ్రద్ధ వహించాలని..పట్టణ ప్రజలు తమకు మున్సిపాలిటీ నుండి అందజేసిన డబ్బాలలో తడి-పొడి చెత్త ఇంటి వద్ద వేరు చేసుకుని మున్సిపల్ వాహనాలకు అందజేయాలని అన్నారు..పర్యావరణ పరిరక్షణలో కూడా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు ..- నర్సంపేట పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలన్నీ పూర్తి చేసుకుంటూ వస్తున్నామనీ మిగిలి ఉన్న పనులను కూడా పూర్తి చేస్తామని పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని కోరారు.- వార్డు సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు..ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్స్ శ్రీరామోజు రోజా రాణి,ఎండి అయూబ్ ఖాన్,ఎలకంటి విజయ్ కుమార్,దొంగల రజిత,అంగన్వాడీ టీచర్స్ నల్లా భారతి,ఎండి గౌసియా,ఆర్, పి లు ఉమ,రజిత,వార్డ్ ఆఫీసర్స్ సిద్ధార్థ్,తరుణ్,మున్సిపల్ సిబ్బంది రమేష్,నవీన్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకం.. అడిషనల్ కలెక్టర్

**కొత్తూరు గ్రామసభలో ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా సవరణపై అవగాహన**




మెట్రో న్యూస్ రాయపర్తి జూన్ 8మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పంచాయతీలో సోమవారం ప్రత్యేక గ్రామసభ సమావేశం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయపర్తి మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కూచన ప్రకాశ్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామాల పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న జనాభా లెక్కల ప్రక్రియ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాల్లో గ్రామీణులు చురుకుగా పాల్గొనాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో కూచన ప్రకాశ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టరుకు అందించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను పాటించి కొత్తూరు గ్రామాన్ని ఆదర్శ స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణపై యువత ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామసభల ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత కోసం పంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అస్మా, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిగ్రీ "దోస్త్" చివరి దశ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఈ నెల 15



జగిత్యాల జిల్లా/మెట్ పల్లి, జూన్ 08 (మెట్రో న్యూస్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరడానికి "దోస్త్" ద్వారా మూడవ, చివరి దశలో అడ్మిషన్ లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ చివరిదని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య అన్నారు. మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ లో సోమవారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు 425 రూపాయలు చెల్లించవలసి ఉంటుందని, బీ.ఏ మరియు బీకాం (కంప్యూటర్స్ కోర్సు) లలో చేరడానికి ఈనెల 15వ తేదీ చివరి తేదీ అని, కానీ వెబ్ ఆప్షన్ లకు మాత్రం 16 వ తేదీ చివరి తేదీ అని అన్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ , ఓపెన్ ఇంటర్ వంటి కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు వెంటనే మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సంవత్సరము ఉపకార వేతనాలు మాత్రం విద్యార్థుల బ్యాంకు ఖాతాలలోనే జమ అవుతాయని, అర్హులైన విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు మంజూరవుతాయని ఆయన స్పష్టంగా ప్రకటించారు. "దోస్త్" మూడవ దశలోనే విద్యార్థులు విధిగా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలనే ఎంపిక చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య సూచించారు. ఈ సమావేశంలో కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ , బిల్ల రాజేందర్, "దోస్త్" కో-ఆర్డినేటర్ ఏ.మనోజ్ కుమార్, బోధన బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రమశక్తి అవార్డు అందుకున్న పంకెర్ల



చిగురుమామిడి: (మెట్రోన్యూస్)రేకొండ ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్, అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం"శ్రమశక్తి"అవార్డు గ్రహీతకు ,రేకొండ శివాలయం ఆవరణలో శాలువాతో 1990 - 1991 వ సంవత్సరం పదవ తరగతి బాల్యమిత్రులు ఘన స్వాగతంపలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహితుడైన కుమారస్వామికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు ఇవ్వడం గర్వకారణంగా ఉందని, మరిన్ని అవార్డులు పొందుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని వారన్నారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ..నన్ను గుర్తించి నా సేవలను అభినందించి, చిన్ననాటి స్నేహితులు సన్మానించినందుకు వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కలువల సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోడిశాల శ్రీనివాస్ గౌడ్, ప్రెసిడెంట్ సభ్యులు జూపాక అంజయ్య, చాడ సతీష్ రెడ్డి, దుడ్డెల సుదర్శన్, పెద్ది సమ్మయ్య, జీడి నాగేష్, పీరల్ల తిరుపతి, పీరల్ల రవిందర్, గద్రతి సమ్మయ్య, అరిగెల తిరుపతి, బిల్ల తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో
METRO EVENINGS
నల్గొండ-ఖమ్మం
సూర్యాపేట | కొత్తగూడెం
యాదాద్రి భువనగిరి | భద్రాద్రి
epaper.metroevenings.com
తేది : మంగళవారం జూన్ 09 2026


# డివిజన్ స్థాయి ప్రజావాణి
# సమస్యలు పరిష్కరించే వేదిక కావాలి.

**డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి డివిజన్ స్థాయి అధికారులందరు తప్పనిసరిగా హాజరుకావాలి.**

**సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి.**

**ప్రజావాణిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు**

**-జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరిక.**




నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్. ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వినూత్నంగా ఆలోచించారు. సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలు విని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. అయితే క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల సత్వర పరిష్కారం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ 30 న, జి ఓ 3 ద్వారా డివిజన్ స్థాయిలో కూడా జిల్లా స్థాయిలో మాదిరిగానే తప్పనిసరిగా ప్రజావాణిని నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు నల్గొండ జిల్లాలోని నల్గొండ,దేవరకొండ, మిర్యా లగూడ,చండూరు డివిజన్లలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నది. అయితే చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా పిర్యాదుదారులు చందం పేట,నెరేడుగొమ్ము లాంటి సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసాలకోర్చి నల్గొండకు రావడం గమనించిన జిల్లా కలెక్టర్ తానే డివిజన్ స్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు విని పరిష్కరిం చాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజలవద్దనుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయికి ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు,పరిష్కరించి ఫిర్యాదులు, పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులు,అడిగి తెలుసు కున్నారు. ప్రజావాణికి హాజరైన డివిజన్ స్థాయి అధికారుల అటెండెన్స్ పరిశీలిం చారు. ప్రజావాణికి హాజరు కాని సహాయ ఎక్సయిజ్ అధికారి,మత్స్య శాఖ,అటవీ శాఖ,అల్పసంఖ్యాఖ ,పౌర సరఫరాల అధికారి,మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్,వ్యవసాయ సహాయ సంచాలకులకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడు తూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తప్పనిసరిగా డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని, ప్రజావాణి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలకు కూడా ప్రజలు సుదూర ప్రాంతాలనుండి నల్గొండ జిల్లా కేంద్రానికి వస్తున్నారని, అలాకాకుండా , ఏ సమస్య అయినా మండల, డివిజన్ స్థాయిలోనే పరిష్కారం కావాలని, ఆ విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు . తమ స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు ప్రభుత్వ స్థాయిలో ఉంటే ఫిర్యాదుదాలకు తెలియజేయాలని, అలాగే సమస్య పరిష్కారమైతే ఆ విషయాన్ని కూడా ఫిర్యాదుదారుకు తెలియజేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కారం కావాలని, ఒకసారి వచ్చిన ఫిర్యాదు దారు మళ్ళీ రాకూడదని,“ ప్రజావాణి డివిజన్ స్థాయిలో సమస్యలను పరిష్కరించే వేదికలు కావాలని“ అన్నారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని, అందువల్ల ప్రతి సోమవారం ఉదయం10.15 గంటలకే ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని, ఏ వారం ఫిర్యాదులు అదే వారం పరిష్కరించాలని ఆదేశించారు. దేవరకొండ, కొండమల్లేపల్లి పట్టణాలలోని అన్ని చెరువుల ఎఫ్ టి ఎల్ నిర్ధారించాలని, ఇరిగేషన్ రెవెన్యూ అధికా రులను, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారిని, సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం విషయం పరిష్కరించాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. సోమవారం దేవరకొండ ఆర్ డి ఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి భూముల సమస్యలు,పిల్లలు తల్లిదండ్రులను పోషించని కేసులు, వ్యక్తిగత సమస్యలు, ఉద్యోగ,ఉపాధి, తదితర అంశాలకు సంబంధించిన సమస్యలు వచ్చాయి. దేవరకొండ ఆర్ డి ఓ పి .పద్మప్రియ, డిఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాని పరిశీలించిన జిల్లా కలెక్టర్.



మెట్రో న్యూస్ తుర్కపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసలమర్రి గ్రామాన్ని విజిట్ చేసిన జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాని పరిశీలించరూ. అనంతరం గ్రామంలో ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి. అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యాయి. ఇంకా ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణాలు ప్రారంభినవి ఎన్ని ఉన్నాయి అని అధికారులని అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినా వారు ఇంకా నిర్మాణం మొదలు పెట్టని వారి ఇంటికి వెళ్లి వారు ఇంటి నిర్మాణం మొదలు పెట్టకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా గ్రామంలో ఇందిర్మమ్మ ఇండ్ల కి అర్హులు వారు ఉన్నారా. ఉంటే ఎంత మంది ఉన్నారు. అందులో ఎల్ 2 కేటగిరి లో ఎంత మంది ఉన్నారు. అర్హులు అయినా వారు ఇండ్లు కట్టుకొవడానికి సిద్ధంగా ఉన్నారా లేదా వివరాలు సేకరించి పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు,డి ఈ హౌసింగ్ -శ్రీరాములు,ఎంపీడీఓ ఎల్ గీతా రెడ్డి,ఏ ఈ హౌసింగ్ నరేష్ ,కార్యదర్శి నవీన్, ఏ పి ఓ ఎర్ర నారాయణ, ఈ సి యశోద, టీ ఏ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణి దరఖాస్తులు 77**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : తహసిల్దార్



మెట్రో న్యూస్, (జూన్08) మఠంపల్లి: మండలంలోని కొత్త దొనబండ తండా గ్రామ పంచాయతీ లో 99 రోజుల ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్పంచ్ బానోతు అరుణా దేశ్ పాండు నాయక్ అధ్యక్షతన ముగింపు గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల తహశీల్దార్ లావురి మంగా గారు హాజరై గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో, ప్రజలతో గుర్తు గా ఫోటో దిగారు.

## గ్రామీణ బ్యాంక్ ఎదుట గిరిజన రైతుల ఆందోళన

**సమస్య పరిష్కారం కాకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తాం -భూక్యా వీరభద్రం**



మెట్రో న్యూస్,ఏన్కూర్, జూన్ 8:ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ తమకు వర్తింపజేయకపోగా, వడ్డీ భారం పెంచి బ్యాంక్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ గిరిజన రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. మూలపోచారం, రాంనగర్ తండా, నెమలిపురి, రంగాపురం గ్రామాలకు చెందిన గిరిజన రైతులు సోమవారం తిమ్మారావుపేటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తిమ్మారావుపేట సెంటర్ నుండి బ్యాంకు వరకు ర్యాలీగా బయలుదేరి ప్రదర్శన నిర్వహించారు. గతంలో పోడు భూమి హక్కు పత్రాల ఆధారంగా తీసుకున్న రూ. 25,000 రుణం, వడ్డీతో కలిసి ప్రస్తుతం రూ. లక్షకు పైగా పెరిగింది. అయితే, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ఈ రైతులకు వర్తించలేదు. దీనికి తోడు బ్యాంకు అధికారులు రుణం చెల్లించాలంటూ రైతులపై తీవ్ర ఒత్తిడి తేవడంతో, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, గిరిజన రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. . స్పందించిన మేనేజర్, రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఫోన్ ద్వారా రీజనల్ మేనేజర్‌తో భూక్యా వీరభద్రం మాట్లాడి, వెంటనే రుణమాఫీ వర్తింపజేసి, రైతులకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ, సీపీఎం మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, ఏర్పుల రాములు, భూక్యా లక్ష్మ, ఇటికాల లెనిన్, రైతు సంఘం నాయకులు నందూరి శ్రీనివాసరావు, గుడ్ల వెంకటేశ్వర్లు, కొంగర సుధాకర్, మాడపాటి మల్లికార్జునరావు, వలపాల నరసింహారావుతో పాటు పోడు రైతులు బోడ రఘు, కోరం రాంమూర్తి, చీమల రాములమ్మ, ఇరప్ప భారతమ్మ, లాకావత్ రామీ, గూగుల్ హోలీ, రంగమ్మ, సమత, అచ్చమ్మ, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు ఉపయోగపడేలా
# గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి..

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావులి**

**రూ.97 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రారంభం**

**రఘునాథపాలెం మండలం**

**వి.వి.పాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల**



రఘునాథపాలెం మెట్రో ఈవెనింగ్ జూన్ 8:భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూలి మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దే

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**




కొత్తగూడెం ఆర్ సి (మెట్రో న్యూస్):నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేననితెచ్చుకున్న తెలంగాణలో యువత కీలక పాత్ర పోషించడం జరిగిందని గత పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ హయాంలో నిరుద్యోగులకు సుమారు 1 లక్షా 67,000 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిచే ప్రత్యేకంగా రూపొందించిన ‘Rakesh Reddy E.Classes App“ను కొత్తగూడెం క్లబ్ లో సోమవారం రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలకు తూట్లు పొడిచిందన్నారు. నిరుద్యోగ యువతకు అనేక వాగ్దానాలు చేసి మూడేళ్లు కావస్తున్న ఉద్యోగాలు ఇచ్చే విషయంలో ఊసెత్తడం లేదన్నారు. తెలంగాణ తెచ్చిన పార్టీనే శ్రీ రామ రక్ష అని తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో ముఖ్యంగా పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో ఐటీ రంగం, ఫార్మా రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువత నోట్లో మన్ను కొట్టిన రేవంత్ రెడ్డి...**

జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ఉద్యోగ ప్రకటన వస్తుందని ఎంతగానో ఆశించారని కానీ మునుపడి లాగే రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువత నోట్లో మన్ను కొట్టడం దుర్మార్గమని ఏనుగుల రాకేష్ రరెడ్డి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వర్ రావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి వ్యవహారంతో అప్పుడే జనాలు విసుగు చెందారని ఇంత స్వల్ప కాలంలో ఇంతటి ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న ఏకైక ప్రభుత్వం ప్రపంచంలో ఇదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, షైన్ ఇంటిట్యూట్ నిర్వాహకులు జలీల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సీతా మహాలక్ష్మి, కిలారు నాగేశ్వర రావు, మానే రామకృష్ణ, వనమా రాఘవేందర్, యువనేత అనుదీప్, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణిలో సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకోవాలి

### జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్



నాగర్ కర్నూల్( మెట్రో న్యూస్:జూన్ 8) జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 07, తగు న్యాయం కొరకు అర్జీలు 11, భార్యాభర్తల గొడవలు 04, మొత్తం కలిపి 22 అర్జీలు స్వీకరించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన తెలియజేశారు.

# చందుబట్లలో వరి నిల్వలపై కలెక్టర్,ఎస్పీ ఆకస్మిక తనిఖీ.

నాగర్‌కర్నూల్ బ్యూరో:-----(మెట్రో న్యూస్:జూన్ 8)నాగర్‌కర్నూల్ మండలం చందుబట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం నిల్వలను పరిశీలించి,భద్రత, నాణ్యత, నిల్వ నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు.తనిఖీ సందర్భంగా గోదాముల సామర్థ్యం,ధాన్యం తేమ శాతం, రవాణా ఏర్పాట్లు,నిల్వల నిర్వహణ తీరును సమీక్షించారు. వర్షాకాలం నేపథ్యంలో ధాన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతుల కష్టానికి తగిన విలువ దక్కాలంటే ధాన్యం నాణ్యతను కాపాడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని, వాహనాల నుంచి ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఎక్కువసేపు నిరీక్షించకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలు, డేటా నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ



నిర్వహించడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ధాన్యం నిల్వ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గోదాములు, నిల్వ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. రైతుల కష్టార్జిత పంట భద్రంగా నిల్వ ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు.

మెట్రో న్యూస్ దేవరకద్ర, జూన్ 8: దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం ఫర్దిపూర్ గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కావాలి నరేష్తో పాటు కుమ్మరి ఆంజనేయులు, పూజారి మల్లేష్, కావాలి నరేందర్, కావాలి శ్రీశైలం, కుర్వ పెద్ద అంజి, మంగలి శంకర్ తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మంగలి కరుణాకర్, మరికల్ మల్లప్ప, మంగలి రఘు, మంగలి



జగదీష్, కుమ్మరి నరేష్, కావాలి నడిపి కుర్మప్ప, చాకలి నరేష్, మంగలి రాజు, ప్యాట గోవర్ధన్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కొత్తగా చేరిన నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

ఈ భారీ చేరికలతో ఫర్దిపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీసీ కెమెరాలు పనిచేయకపోవడం ఏమిటి

### సఖి కేంద్రంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

### సిబ్బంది నిబద్ధతతో పని చెయ్యాలి



జోగులాంబ గద్వాల, జూన్ 08(మెట్రో న్యూస్) : సఖి కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని, నిబద్ధతతో పనిచేయకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాలలోని సఖి కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీ, స్టోర్, సర్వైవర్, కిచెన్, తదితర విభాగాలను తిరిగి పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు ఇతర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఇటీవల సంరక్షించబడ్డ ఓ మహిళ అదృశ్యం కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయకపోతే లాభమేమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లలో కేంద్రంకు వచ్చిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హింసకు గురై, ఇతర సమస్యలతో బాధపడుతున్న మహిళలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, ఇతరాత్ర సమస్యలతో వేదనకు గురైన బాలికలను సంరక్షించేందుకు, కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రంలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. పోలీసు శాఖ నుంచి రిఫర్ చేసిన కేసులే ఇక్కడికి ఎక్కువగా వస్తున్నాయని, సఖి తరపున సంరక్షించబడుతున్న కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు చాలా తక్కువ మంది హాజరయ్యారని, పెద్ద ఎత్తున, ఎక్కువ మందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల్లో సఖి సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిని ఉద్యోగంలో నుంచి తొలగించి, అర్హులైన ఇతరులను తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సఖి కేంద్రం పరిసరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అక్కడ పొదలు, ఇతర వ్యర్థాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు రక్షణ, ఆశ్రయం కల్పించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# కవిత బి కేర్ఫుల్... మీ ఇంటి ముందుకు వచ్చి మైక్ పెట్టి మాట్లాడతా..!

### -టీఆర్ఎస్ చీఫ్ కవిత వ్యాఖ్యలకు ఎంపీ రఘునందన్ కౌంటర్

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:తాను ఎవరితోనూ లాలూచీ పడటం లేదని, తాను బీఆర్ఎస్ పార్టీతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేశానంటూ టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. ఇంకోసారి తన గురించి మాట్లాడితే జూబ్లిహిల్స్ కు వచ్చి కవిత ఇంటి ముందే మైక్ పెట్టి మాట్లాడుతానని హెచ్చరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమాలు, అవినీతిని పక్కనపెట్టి ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు. తెలంగాణ వస్తే సింగూరు ప్రాజెక్టుపై కుర్చీ వేసుకుని మరమ్మతులు చేయిస్తానన్న కేసీఆర్ ఎందుకు ఆ పనులు చేయలేదని రఘునందన్ నిలదీశారు. సింగూర్ లో చేపలు తినలేకపోయిండు గానీ, ఆంధ్రా పోయి రోజా ఇంట్లో రొయ్యలు మాత్రం



మింగిండని విమర్శించారు. సంగారెడ్డిలో టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా పర్యటించిన కవిత అన్ని పార్టీల వారు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నారంటూ పలు విమర్శలు చేశారు. దీంతో ఆమె వ్యాఖ్యలకు కౌంటర్ గా సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కవిత పార్టీకి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఆమె ఎవరితో కలిసి పనిచేస్తున్నారో తెలుసని రఘునందన్ అన్నారు. జాగృతి పెట్టినప్పుడు కవితకు, ఇప్పటి కవితకు చాలా తేడా ఉందని వ్యాఖ్యానించారు. తెల్లాపూర్ ను తెలంగాణపూర్ గా మార్పిస్తానని చెప్పారని, మీ నాయన సీఎంగా ఉన్నప్పటికీ ఒక్క పని కూడా చేయించలేక పోయావని విమర్శించారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం ఇవ్వకపోతే తెల్లాపూర్ శాసనానికి కట్టేసి కొట్టమని చెపుతున్నారని ఎద్దేవా చేశారు. కవిత నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడుతుందని విమర్శించారు. తానేదో జహీరాబాద్ ఎంపీ అన్నట్లుగా కవిత అవివేకంగా మాట్లాడుతుందని, తాను మెదక్ ఎంపీ అన్న విషయం కవితకు తెలియదా? అని ప్రశ్నించారు. తాను జహీరాబాద్ కు బుల్లెట్ ట్రైన్ తీసుకొస్తానని హామీ ఇచ్చినట్లు కవిత చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రఘునందన్ అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రాజేశ్వరరావు దేశ్పాండే, కొండాపురం జగన్, సంగమేష్, పవన్ ముదిరాజ్, నాగరాజ్, కసిని వాసు, దోమల విజయ్ కుమార్, నరేన్ దేశ్పాండే తదితరులు పాల్గొన్నారు.

## నాలా బఫర్ జోన్ కబ్జా..!

- అనుమతులు లేకుండానే భారీ భవనాల నిర్మాణాలా..?
- అధికారుల మౌనంపై అనుమానాలు..!
- తెల్లాపూర్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు..!



(మెట్రో న్యూస్)రామచంద్రపురం:తెల్లాపూర్ డివిజన్‌లో నాలా బఫర్ జోన్‌ను ఆక్రమిస్తూ భారీ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.75 గజాల్లో ఐదు అంతస్థుల వరకు భవనాలు నిర్మితమవుతున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడం, తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా తెల్లాపూర్ సర్కిల్ కార్యాలయం సమీపంలోనే ఈ పనులు సాగుతుండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికుల కథనం ప్రకారం, నాలా బఫర్ జోన్ పరిమితులను పక్కనపెట్టి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని భవనాలకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా స్పష్టత లేదని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు పొందినట్లయితే వాటి వివరాలను బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.సాధారణంగా చిన్నపాటి ఉల్లంఘనల విషయంలో వెంటనే స్పందించే అధికారులు, భారీ స్థాయిలో సాగుతున్న నిర్మాణాలపై మాత్రం మౌనం పాటించడం పలు సందేహాలకు కారణమవుతోందని అంటున్నారు. నాలా బఫర్ జోన్‌లో నిర్మాణాలు కొనసాగితే వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి భవిష్యత్తులో వరద సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నిర్మాణాల అనుమతులు, బఫర్ జోన్ పరిమితులు, భద్రతా ప్రమాణాల అమలుపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో జూన్ 8:గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను జిల్లాలోని 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరూ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడంలో అత్యంత ప్రభావవంతమైనదని, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి పూర్తి రక్షణ కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యాక్సిన్‌పై ఎలాంటి అపోహలు, భయాందోళనలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, అర్హులైన బాలికలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి బాలికకు మిషన్ మోడ్‌లో వ్యాక్సినేషన్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఈ వ్యాక్సిన్ ప్రధానంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండేదని, సర్వైకల్ క్యాన్సర్ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు టీవీవీపీ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల మొత్తం 12,635 మంది బాలికలు ఉండగా, ఇప్పటివరకు 2,786 మంది మాత్రమే హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకున్నారని తెలిపారు. మిగిలిన అర్హులైన బాలికలకు వ్యాక్సిన్ అందేలా విద్యాశాఖ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించి, వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ప్రజలు అపోహలను నమ్మకుండా వైద్య నిపుణుల సూచనలను పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలిక ఈ ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన కోరారు.

మెట్రో

METRO EVENINGS

ఆదిలాబాద్-నిజామాబాద్

మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్

epaper.metroevenings.com

తేది : మంగళవారం జూన్ 09 2026 | పేజి నెం. : 8


## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్

### మున్సిపల్ సమస్యల పరిష్కారానికి కృషి

### చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి





మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్:జూన్ 08/2026. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లోని సమస్యలను పరిష్కరించేంకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు లో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, కమిషనర్ మారుతి ప్రసాద్, పట్టణ ఎస్ఐ జె శ్రీధర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేకూరేలా ప్రయత్నం చేస్తామని చైర్మన్, వైస్ చైర్మన్ తెలిపారు. వార్డుల వసతికి , అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనుల విషయాల పై ప్రత్యేక దృష్టి సాధించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి వినతిని పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, కౌన్సిలర్లు ,మాజీ కౌన్సిలర్లు ,యూత్ నాయకులు ,బారాస శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిర్వహించి

# రెండేళ్లయినా అందని బకాయిలు..

### కలెక్టరేట్‌లో ఫొటోగ్రాఫర్ల ఆందోళన



మంచిర్యాల ప్రతినిధి:పార్లమెంట్ ఎన్నికల విధుల్లో రాత్రింబవళ్లు శ్రమించి పనిచేసిన ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని, రెండేళ్లు గడుస్తున్నా తమకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమని మంచిర్యాల నియోజకవర్గ ఫొటోగ్రాఫర్స్,వీడియో గ్రాఫర్స్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములును అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రూ. 4 లక్షల బిల్లులు పెండింగ్.. ఆర్థిక ఇబ్బందుల్లో బాధితులు

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా తాము ఎన్నికల విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించామని గుర్తుచేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు సంవత్సరాలు దాటిపోతున్నప్పటికీ, తాము చేసిన పనికి సంబంధించిన పూర్తి పారితోషికాన్ని అధికారులు ఇప్పటివరకు విడుదల చేయలేదని మండిపడ్డారు.

మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు వీడియో, ఫొటోగ్రాఫర్లకు కలిపి ఇంకా సుమారు రూ. 4 లక్షల రూపాయల బకాయిలు రావాల్సి ఉందన్నారు. నమ్ముకున్న వృత్తిని పక్కనబెట్టి ప్రభుత్వ ఎన్నికల విధుల్లో పాల్గొంటే, ఇంతకాలం బిల్లులు ఆపడం వల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణమే స్పందించి న్యాయం చేయాలి

చిన్నపాటి వృత్తిదారులమైన తమపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు లక్షల రూపాయల ఎన్నికల బకాయి బిల్లులను తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు అడిషనల్ కలెక్టర్‌ను వేడుకున్నారు. దీనిపై అడిషనల్ కలెక్టర్ వి. రాములు సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను పరిశీలించి త్వరలోనే బకాయిలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ ప్రతినిధులు జక్కుల రాజు, కుమారస్వామి, పరమేష్, మల్లేష్, శ్రీనివాస్,పలువురు ఫొటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 19వ,వార్డు అభివృద్ధే మా లక్ష్యం

### వార్డు సభ్యురాలు రంగ లక్ష్మీ రాజు



మెట్రో న్యూస్,రామకృష్ణాపూర్: జూన్ 08/2026.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా క్యాతన్ పల్లి మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు లో సోమవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో స్థానిక వార్డు ప్రజలు సమస్యలపై వార్డు కౌన్సిలర్ రంగ లక్ష్మీ రాజు,మున్సిపల్ సిబ్బందికి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ రంగ లక్ష్మీ రాజు మాట్లాడుతూ.....వార్డులో ఎలాంటి సమస్యలైన వార్డు ప్రజలు ఎప్పటి కప్పుడు మా దృష్టికి తీసుకువచ్చినట్లయితే ఆ సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని,తద్వారా వార్డులో అభివృద్ధి పనులు జరగటానికి ఆస్కారముంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ మాట్లాడుతూ...నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని,సమాజంలో జరిగే అవాంతరాల సంఘటనలను గూర్చి ఎప్పటికప్పుడు పోలీస్ వారికి తెలియజేసే యువకులుగా సామాజిక బాధ్యతలను కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెనంక శ్రీనివాస్,కౌడగొని సాంబయ్య,మద్దెల శంకర్, ఆర్నె సంధ్య,వార్డు ఇంచార్జ్ ,పోలీస్ సిబ్బంది తోపాటు పెద్ద ఎత్తున వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 12వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారాన్ని కృషి

### కౌన్సిలర్ గోపతి భాగ్య రాజయ్య



మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్:జూన్ 08/2026. స్థానిక గాంధీ నగర్ లోని మహంకాళి టెంపుల్ వద్ద నిర్వహించిన 12 వ వార్డు సభలో కౌన్సిలర్ గోపతి భాగ్య రాజయ్య వార్డులోని సమస్యలను మున్సిపల్ అధికారులకు వివరిస్తూ వారి నుంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్థానని వార్డు సభ్యులకు హామీ ఇచ్చారు. వార్డులో గల డ్రైనేజీలను విడతలవారిగ క్లీన్ చేయాలని, రాబోయేది వర్షాకాలం కావున విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రోడ్డు పక్కన పెరిగే పిచ్చి మొక్కలను క్లీనింగ్ చేయాలని, ఎలాంటి సమస్యలు ఉన్న ముందు జాగ్రత్తగా కౌన్సిలర్,మున్సిపల్ అధికారులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. రాబోయే వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ నుంచి ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు ఇవ్వడం జరుగుతుందని, అందులో ఒకటి తడి చెత్తకు,మరొకటి పొడి చెత్తకు, అలాగే గాజు, పింగానీ వస్తువులకు, కప్ బోర్డు, ఆట వస్తువులకి వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వార్డు సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, చైర్మన్ సంధ్యారాణి, వార్డు ఆఫీసర్ రవికుమార్ తో పాటు వార్డు ప్రజలు పాల్గొని వార్డు సభను విజయవంతం చేసారు.

# ప్రోటోకాల్ పాటించడం లేదని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ను నిలదీసిన బిఆర్ఎస్ నేతలు

### ప్రజా పాలనలో చైర్మన్, వైస్ చైర్మన్ కు ప్రాధాన్యం ఇవ్వని కమీషనర్

### బిఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్



మెట్రో న్యూస్,రామకృష్ణాపూర్:జూన్ 08/2026.క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ నిర్వహిస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు మండిపడ్డారు. సోమవారం రామకృష్ణాపూర్ పట్టణంలోని 17వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలోని ఫ్లెక్సీ లలో మునిసిపల్ చైర్పర్సన్ గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరితల ఫోటోలు లేకపోవడంతో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ ను బిఆర్ఎస్ నాయకులు నిలదీశారు. ఈనెల 4 నుండి ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ వారు ఆరోపిస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ దృష్టికి ప్రోటోకాల్ విషయం తీసుకెళ్లినప్పటికీ ప్రోటోకాల్ ను పక్కనపెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులపై కమిషనర్ చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా కాంగ్రెస్ కౌన్సిలర్ వార్డులకి నూతన రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీలో చేపడుతూ తమ తమ వార్డులకు నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ విషయంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఎస్సీ సెల్ కు ఫిర్యాదు చేయబోతున్నట్లు డాక్టర్ రాజా రమేష్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, కౌన్సిలర్లు బొమ్మ భూమా గౌడ్ , గ్యాస్ నాని, కొప్పి రాజశేఖర్,మాజీ కౌన్సిలర్లు అనిల్ రావు, రెవెల్లి ఓదెలు, రామిడి ఉమాదేవి, నాయకులు మంద వేణుగోపాల్, కొండ కుమార్, పిల్లి సతీష్, లక్ష్మి కాంత్, నాయకులు, మహిళ నాయకురాళ్ళు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజావాణి కి 65 దరఖాస్తులు



కామారెడ్డి జూన్ 8 (మెట్రో న్యూస్)ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయని, అర్జీదారులు సమర్పించిన వినతులను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి లో అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డి ఆర్ ఓ పాండు, జెడ్పి సీఈవో చందర్, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

## ప్రజావాణికి 146 ఫిర్యాదులు



నిజామాబాద్, జూన్ 08(మెట్రో ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 146 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి







### -కలెక్టర్ ఇలా త్రిపాఠి

### -ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళికలో భాగంగా శ్రమదానం

నిజామాబాద్, జూన్ 8 ( మెట్రోన్యూస్ )ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో సోమవారం నగరంలోని 41వ డివిజన్ వసంత్ నగర్ లో శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు నగర మేయర్ కూరగాయల ఉమారాణి, డిప్యూటీ మేయర్ సల్మా తహ సీన్, కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు స్థానికులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాన్ని శ్రమదానంతో శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళికలో శ్రమదానం అంశం లేనప్పటికీ, పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ నగరంలో ప్రత్యేకంగా శ్రమదానం కారక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడుకోవాలని, తద్వారా ఆ స్థలాలను స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్కులు, వాకింగ్ ట్రాక్ తదితర వాటి కోసం వినియోగించుకునేలా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ప్రస్తుతం శ్రమదానం చేసిన సుమారు 10 వేల చదరపు గజాల మున్సిపల్ స్థలాన్ని పరిరక్షించేందుకు సరిహద్దులను గుర్తిస్తూ బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఆహ్లాదాన్ని అందించేలా పూల మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పూజిత, స్థానిక ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఎం ధర్నా.






నిజామాబాద్, జూన్ 8( మెట్రోన్యూస్ ) సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరుపేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలో పేద ప్రజలు రైస్ మిల్లులు , పసుపు మిల్లులలో, ఇతర పనులు చేస్తూ రోజు కూలీలతో బతుకుతున్న వారు అనేకసార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కానీ, నేటి ప్రభుత్వం కానీ నిరుపేదలైన వారికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో సరైన కూలీ దొరకక ఆర్థిక ఇబ్బందులతో పేదలు అప్పుల పాలవుతున్నారని వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఇండ్ల స్థలం లేని వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే కాలంలో పేదల తోటి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి సుజాత నగర కార్యదర్శి వర్గ సభ్యులు నల్వాల నరసయ్య, నగర నాయకులు ఉద్ధవ్, శంషుద్దీన్ ,నిరుపేదలు గణేష్, లక్ష్మి, సరస్వతి, గంగమ్మ, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అవినీతి , అక్రమాల్లో మకుటం లేని మహా రాజు

# ఎల్.బి.నగర్ జోనల్ సి.పి. శ్రీనివాస్ యాదవ్



- సి.పి. గారి అవినీతి అంత ఇంత కాదు
- వడ్డించే వాడు మన వాడు ఐతే ఎక్కడ ఉన్నా మనకు దక్కుతుంది అనే సామెతను నిజం చేస్తున్న సి.పి
- సి.పి.గారి ఆశీర్వాదం ఉంటే ఏలాంటి ఫైల్ అయినా అప్రూవల్ అవుతుంది
- అనుమతులు రాని చోట అనుమతులు ఇవ్వడం, కమర్షియల్ భవనాలకు డొమెస్టిక్ ఓ.సి.లు జారీ చేయడం
- ఛలో ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయం ముడుపులు ఇచ్చుకోండి అనుమతులు పొందండి

**మెట్రో న్యూస్, ఎల్ బి నగర్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారుతుంది. అందుకు ఎన్నో ఉదాహరణలు. మనం సామాజిక మాధ్యమాల్లో, పలు దినపత్రికలలో తరచుగా చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం గురించి మనం పెద్దగా చెప్పాల్సిన పని లేదు. ఇక్కడ జరిగే అవినీతి అంత ఇంత కాదు. టి.డి.ఆర్, ఎల్.ఆర్.ఎస్, భవన నిర్మాణ అనుమతులు, ఓ.సి.లు ఇలా అన్నిటిలో అవినీతి, అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.ఎల్.బి.నగర్ జోనల్ పరిధిలోని నాగోల్ సర్కిల్, సర్వే నెంబర్ 30 ఈ ప్రాంతం మాస్టర్ ప్లాన్ ప్రకారం ఓపెన్ స్పేస్ జోన్‌లో ఉంది. నిబంధనల ప్రకారం ఇక్కడ ఏలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఇక్కడ కె.ఎస్.ఆర్ నిర్మాణ సంస్థ భారీ స్థాయిలో రెండు టవర్స్‌తో కూడిన ఐదు అంతస్తుల భవనాన్ని ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు. భవన నిర్మాణానికి పలు మార్లు సంబంధిత నిర్మాణదారుడు దరఖాస్తు చేసుకోగా టౌన్ ప్లానింగ్ అధికారులు పలు మార్లు తిరస్కరించడం జరిగింది.కానీ ఇక్కడ నిర్మాణం పూర్తి అయ్యాక అనుమతులు రావడం స్థానికుల్లో చర్చకు తావునిస్తోంది. ఇక్కడ ఎన్నో సంవత్సరాల నుండి ఉంటున్న స్థానికుల రాని భవన నిర్మాణ అనుమతులు ఒక నిర్మాణ సంస్థకు రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భవన నిర్మాణ అనుమతులు రావడంలో ఎల్.బి.నగర్ జోనల్ టౌన్ ప్లానింగ్ సి.పి. ముఖ్య పాత్ర పోషించాడనే ఆరోపణలు వస్తున్నా తనకు ఏ మాత్రం పట్టదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడు.ఈ అధికారి అవినీతి, అక్రమాల గురించి మనం ఎంత తక్కువ మాట్లాడినా తక్కువే. అవినీతి, అక్రమాల్లో మకుటం లేని మహారాజుగా చలామణి అవుతున్నాడు. వడ్డించే వాడు మన వాడు ఐతే మనకు ఎక్కడ ఉన్నా దక్కుతుంది అన్న సామెతను నిజం చేస్తున్న సి.పి. శ్రీనివాస్ యాదవ్ గారు. సి.పి.గారి ఆశీర్వాదం ఉంటే ఏలాంటి ఫైల్ అయినా అప్రూవల్ అవుతుంది.సదా సి.పి.గారి ఆశీర్వాదంతో అనుమతులు రాని చోట అనుమతులు ఇవ్వడం, కమర్షియల్ భవనాలకు డొమెస్టిక్ ఓ.సి.లు ఇవ్వడం ఇలా ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. సి.పి. శ్రీనివాస్ ఇచ్చిన కొన్ని ఎల్.ఆర్.ఎస్, ఓ.సి.లకు సంబంధించిన వాటిపై వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది.ఓపెన్ స్పేస్‌లో అనుమతులు, ఓ.సి. జారీ చేసిన అనుమతుల్లో ఇద్దరు జోనల్ కమిషనర్ల పాత్ర, జరిగిన అవినీతి, అక్రమాలపై మరో కథనంతో మీ ముందుకు. ఛలో ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం. ముడుపులు ఇచ్చుకోండి, అనుమతులు పొందండి అన్న పదం నిజమేనా?జోనల్ సి.పి. శ్రీనివాస్ యాదవ్ గారి అవినీతి, అక్రమాలపై మెట్రో న్యూస్ మరో కథనంతో మీ ముందుకు.

# యథేచ్ఛగా భవన నిర్మాణ అనుమతులు జారీ

- ఏసీబీ దాడులు జరుగుతున్నా డోంట్ కేర్
- చట్టాలను చెదలు పట్టిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం
- భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు
- అవినీతి, అక్రమాలు అన్ని ఇన్ని కావు
- చరిత్ర తిరగరాస్తున్న వైనం
- ఇది ఆరంభం మాత్రమే, అంతం కాదు



**మెట్రో న్యూస్, నార్సింగి:** సైబరాబాద్ మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ అధికా రుల అవినీతి అంతా ఇంతా కాదు. ఇక్కడ భూముల ధరలు ఆకాశాన్ని తాకడం, వాటిని అవకాశంగా మార్చుకొని నిబంధనలను తుంగలో తొ క్కుతూ తమ ఇష్టానుసారంగా భవన నిర్మాణ అనుమతులు, ఓసీలు, ఎల్ఆర్ఎస్‌లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.చట్టాలకు, జీవోలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాల్సిన అధికారులు అవినీతి, అక్రమాల్లో మునిగితేలుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నార్సింగి సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 53, ప్లాట్ నంబర్లు 12, 13, 14, 15లలో ఒక నిర్మాణ సంస్థ ఐదు అంతస్తుల భవన నిర్మాణాని కి దరఖాస్తు చేసుకుంది. అనంతరం అధికారులు పరిశీలించి అనుమ తులు జారీ చేశారు.అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 7.5 మీటర్ల రోడ్డు ఉన్న ప్రాంతంలో ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదని, కనీసం 9 మీటర్ల రోడ్డు ఉండాలని నిబంధనలు చెబుతు న్నాయి. బహుళ అంతస్తుల భవనాల వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిబంధనలు రూపొందించబడ్డాయి. అయితే ఈ నిబంధనలను అధికారులు బేఖాతరు చేస్తూ భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడం దేనికి సంకేతమనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. దీని వెనుక అవినీతి ఎంత, ముడుపుల వ్యవహారం ఎంత అనే అనుమానాలువ్యక్తమవుతున్నాయి.కమిషనర్,ఏసీపీ,టీపీఎస్‌లపై విజి లెన్స్ విచారణ జరిగితే అనేక అంశాలు వెలుగులోకి వచ్చే అవ కాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.మరి ఉన్నతాధికా రులు స్పందిస్తారా? ఇలాంటి అవినీతి, అక్రమాలను ఉపేక్షిస్తారా? లేక చట్టం తన పని తానుచేసుకుంటూపోతుందా?మరో కథనంతో మీ ముందుకు.

# మున్సిపల్లో ఎప్పటికపుడు ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

## - మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి సీతారాంపేట్లోని 7వార్డులో వార్డు సభ



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం** :ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం మున్సి పాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు.ఈ సంద ర్భంగా ప్రజలకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026,4 విధాల చెత్త వేరు చేయడం,వర్షాకాల సన్నద్ధత,పారిశుధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ పూడిక తొలగింపు, ఎస్.ఐ.ఆర్, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్), మొక్కలను నాటడం లాంటి కార్యక్రమా లుపై ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించారు.ఈ సం దర్భంగా వార్డు కౌన్సిలర్,చైర్మన్ మాట్లాడుతూ... ప్రజల నుండి ఎలాం టి ఫిర్యాదులు, సూచనలు వచ్చిన వాటి తక్షణ పరిష్కారం కోసం సం బంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసి సమస్యను ఎప్ప టికీ అప్పుడు పరిష్కరించే విధంగా చూస్తున్నాము. స్థానిక ప్రజలు, ప్రజాప్రతి నిధులు, సమాజ సభ్యుల చురుకైన భాగస్వామ్యంతో వార్డు సభ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం పట్నం మున్సి పల్ మేనేజర్ జక్క వెంకట శివయ్య, వార్డ్ ఆఫీసర్ శృతి, సీతారాంపేట్ వార్డు ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలు లేని వార్డుగా 13 వార్డును మారుస్తాం

## - కౌన్సిలర్ ఇందూరి శ్రీనివాస్ 13 వార్డులో 1.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతాం



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 13 వ వార్డులో వార్డ్ కౌన్సిలర్ ఇందూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించగా వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభలో వార్డు ప్రజలు పలు సమ స్యలు విన్నవించగా తక్షణమే స్పందించిన వార్డు కౌన్సిలర్ ఇందూరి శ్రీనివాస్ సంబంధిత అధికారులకు తక్షణమే సమస్యలు తీర్చాల్సిం దిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... తాను కౌన్సిలర్ గా గెలిచేనాటికే వార్డు పూర్తిగా సమస్యల మయంగా ఉందని,దీంతో తాను మొదటి రోజు నుంచే తానే స్వయంగా వార్డులోని ప్రతి కాలనీకి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఏ రోజుకు ఆ రోజే సమస్యలు పరిష్కరిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు సహిద్,శ్రీకాంత్, శ్రీకృష్ణ,మునీర్ భాయ్, షాంషు భాయ్, రహీమ్, సైది రెడ్డి వార్డ్ ఆఫీసస్ నడ్డి పవన్, క్రాంతి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐ.డి.ఓ.సి. కాంప్లెక్స్‌లో 'ప్రజావాణి' కార్యక్రమం



## - 106 దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్):** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లో జిల్లా ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈరోజు (సోమవారం) ఐ.డి.ఓ.సి. మీటింగ్ హాల్‌లో 'ప్రజావాణి' (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్‌అహ్మద్ , అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి , జిల్లా రెవిన్యూ అధికారి మాలతిలు సంయుక్తంగా నేతృత్వం వహించారు.జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజల నుండి అడిష నల్ కలెక్టర్లు స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 106 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో ప్రధానంగా భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు, మరియు స్థానిక సంస్థల పరిధిలోని డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై ప్రజలు వినతి పత్రాలను సమర్పించారు ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్లు మాట్లా డుతూ, ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అ ధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ నీంకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ నీంకర్‌ను నియోజకవర్గం పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్‌అరోరా ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్క రించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయ కులు పులి మురళి, పట్లోల్ల రాజశేఖర్ రెడ్డి, మల్లవరపు శరత్ కుమార్,మండవరాధేశ్యామ్, పిన్నంరాజు శ్రీనివాసరాజు, పాలడుగు నాగేశ్వరావు, బైరోని లక్మణ్, పాతూరి గోపి, జున్ను సాయిశ్రీనివాస్, గొర్తి రాజేష్ రాయ్, ఇ.సర్వేశ్వరరావు (నాని) పాల్గొన్నారు.

# ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష ఆదరణ



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ తరఫున వసంతనగర్ డివిజన్ పరి ధిలోని సిక్స్ ఫేస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. మెడికవర్ హాస్పిటల్స్, వాసన్ ఐకేర్, ఏషియన్ డెంటల్ సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి వందలాది మంది ప్రజలు పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి సేవల ను ప్రశంసించారు. సామాజిక సేవకుడిగా ప్రజలకు అండగా నిలు స్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. సాయిబాబు చౌదరి మాట్లాడుతూ, మందలపు రోజారాణి చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజా సేవే తన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వ హించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు వురు డాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పెద్దసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# దోమ పాఠశాల విద్యార్థిని ప్రేరణ త్రిబుల్ ఐటీ బాసరకు ఎంపిక



**పరిగి (మెట్రో న్యూస్ ):** వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి పరీక్షలలో టాపర్‌గా నిలిచిన గౌర్వార్ ప్రేరణ బాసర ఐఐఐటికి యూనివర్సిటీ నిబంధనల మేరకు సోమవారం కళాశాలలో ప్రవేశం కావడం జరిగిందని దోమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్బంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ మన దోమ పాఠ శాలలో చదివి 2016 -2017 నుండి సుమారుగా ఇప్పటి వరకు నలుగురు బాసరకు ఎంపిక కావడం అభినందనీయమని తెలి పారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని విద్యను భోదిస్తున్నామ న్నారు. ఇంతకు ముందు కంటే ఈసారి పాఠశాలలో ఉత్తీర్ణత శాతం బాగా పెరిగిం దని,మార్కులు మంచి స్థాయిలో వచ్చాయని తెలిపారు. ప్రేరణ పాఠ శాల టాపర్‌గా అధిక మార్కులు సాధించి గ్రామ సర్పంచ్ మాలి శివ కుమార్ రెడ్డిచే పది వేల నగదు పురస్కారం తెలంగాణ ఆవి ర్భావ దినోత్సవం రోజు అం దుకోవడం, ఈరోజు త్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించడం తమకు సంతోషంగా ఉందని తెలి పారు .మా పాఠశాల ఉపాధ్యా యులపై నమ్మకంతో ప్రభుత్వ బడికి మీ పిల్లలను పంపిస్తున్న. తల్లి తండ్రులకు, గ్రామస్థులకు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు..

# కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా పాలమోని రామకృష్ణ యాదవ్ నియామకం



**మెట్రో న్యూస్, ఇబ్రహీంపట్నం :** ఏఐసీసీ ఆదేశాల ప్రకారం టీపీసీసీ అధికార ప్రతినిధులను ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ గా యాచారం మండలం అయ్యవారి గూడ గ్రామానికి చెందిన పోల మోని రామకృష్ణ యాదవ్ నియామకం అయ్యారు.ఈ మేరకు పార్టీ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ.... తన నియామకానికి కృషి చేసిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు,స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కి,యాచారం మాజీ ఎంపీపి రాచర్ల వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన ఈ బాధ్యతను నిర్విఘ్నంగా పార్టీ పెద్దల అన్నదండలతో నిర్వహిస్తూ, పార్టీని అభివృద్ధి పదంలోకి తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

# ఆంధ్ర వార్తలు మెట్రో

మంగళవారం,
09 జూన్ 2026








## 9 జోన్లుగా అమరావతి

మూడు నాలుగు గ్రామాలకు ఒక గ్రిడ్, జోన్ ప్రత్యేక కలెక్టర్ల నియామకం, అమరావతి రాజధాని పరిపాలనలో మార్పులు చేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సిఆర్డిఏలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఎకు, గ్రామవార్డు సచివాలయ విభాగాలకు ఈ మేరకు ప్రభుత్వం నుం డి అనుమతి ఇచ్చింది. అమరావతి రాజధాని ప్రాంతం మొత్తాన్ని తొమ్మిది జోన్లుగా మార్చారు. కొత్త కమిషనర్ విజయరామరాజు వచ్చిన తరువాత రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి తొమ్మిది జోన్లు ఏర్పాటు చేశారు. దీనిలో ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్ జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక, ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్ స్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు.

## సిద్ధాంతంలో జనం పరవళ్లు

### సీఎం చంద్రబాబు సభకు పోటెత్తిన జనం

భీమవరం బ్యూరో, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పెనుగొండ మండలం సిద్ధాంతంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రధాన భూపరిపాలన కమిషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అచంట శాసనసభ్యులు పితాని



సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు హాజరయ్యారు. సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం రైతులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతం, క్యాడర్ మీటింగ్ వేదిక, రైతుల సమావేశ ప్రదేశాలు చంద్రబాబు సమావేశం కోసం సిద్ధం చేశారు. భూములకు రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ముఖ్యమంత్రి స్వయంగా పంపిణీ చేయనున్నారు.



## రామోజీరావు స్థానం.. ప్రజల హృదయాల్లో శాశ్వతం

అమరావతి: తెలుగు ప్రజలు గర్వించే మీడియా సంస్థలను అందించిన రామోజీరావు స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. రామోజీరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళులర్పించిన సీఎం.. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, మీడియా రంగంలో ఓ యుగకర్త, అక్షర యోధుడు రామోజీరావుకు నివాళులు. సామాన్య కుటుంబం నుంచి అసామాన్య శిఖరాలను అధిరోహించి, మీడియాను ప్రజా చైతన్యానికి వేదికగా మలచిన ఆయన సేవలు చిరస్మరణీయం. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్యసాహసాలతో నడిచిన ఆయన ప్రస్థానం తరతరాలకు స్ఫూర్తి, పత్రికా రంగమంటే వ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత అని భావించి, ఆచరించి చూపించిన ఆదర్శవాది. తెలుగు ప్రజలు గర్వించే మీడియా సంస్థలను అందించిన ఆయన స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతం. ఆయన కీర్తి అజరామరం అని చంద్రబాబు ఎక్స్లో పోస్టు చేశారు.

జర్నలిజంలో నాణ్యత, విశ్వసనీయతకు రామోజీరావు ప్రతీక అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన దార్శనికుడని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రామోజీరావు స్ఫూర్తి.. తరతరాలకు వెలుగునిస్తూనే ఉంటుందని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

## నామినేషన్ దాఖలు చేసిన తెదేపా రాజ్యసభ అభ్యర్థులు

అమరావతి: తెదేపా రాజ్యసభ అభ్యర్థులుగా సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి.. నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతకుముందు తెదేపా కేంద్ర కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు శనివారం తెదేపా అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ తెదేపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా.. పార్టీ సంస్థాగత నిర్మాణం, శిక్షణ కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఆయన గుంటూరు లోక్సభ టికెట్ ఆశించినా వివిధ కారణాలతో టికెట్ ఇవ్వలేకపోయారు. అయినా ఆయన పార్టీనే అంటిపెట్టుకుని సేవలందించారు.



కాకినాడకు చెందిన సానా సతీష్ 2024 ఎన్నికల్లో లోక్ సభ టికెట్ ఆశించినా.. దక్కలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక 2024 డిసెంబరులో మోపిదేవి వెంకట రమణారావు రాజీనామాతో రాజ్యసభకు జరిగిన ఉప ఎన్నికలో సతీష్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఏడాదిన్నరపాటే ఎంపీగా ఉండటంతో సామాజిక సమీకరణాల్ని దృష్ట్యా మరోసారి అవకాశం కల్పించారు. బీసీ సామాజికవర్గానికి అవకాశం కల్పించడంతో పాటు యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని అధిష్ఠానం విజయ్ వైపు మొగ్గు చూపింది. విజయ్ తండ్రి అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా ఉన్నా, తెదేపా ప్రతిపక్షంలో ఉండగా విజయ్ అందించిన సేవలు ఆయన అభ్యర్థిత్వంపై అధినేత మొగ్గు చూపడానికి ఉపయోగపడ్డాయి. 2024 ఎన్నికల్లో విజయ్ అనకాపల్లి లోక్సభ టికెట్ ఆశించినా అప్పటి రాజకీయ సమీకరణాల వల్ల ఆయనకు అవకాశం దక్కలేదు. తన కుమారుడికి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ఈసారి గట్టిగా కోరడంతో, ఆయన విజ్ఞప్తినీ పరిగణనలోకి తీసుకుని విజయ్ను ఎంపికచేశారు.

## ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగ సంఘాల అత్యవసర భేటీ!

ఆంధ్రప్రదేశ్ రవాణా రంగంలో తీవ్ర సంచలనం రేపుతూ.. ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు మరోసారి పోరాట పంథాకు సిద్ధమయ్యాయి. ఆర్టీసీ పరిరక్షణే ఏకైక లక్ష్యంగా ఉద్యోగ సంఘాల నేతలు అత్యవసరంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ తాజా నిర్ణయాలు, ఆర్టీసీ భవిష్యత్తుపై ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి. విజయవాడ వేదికగా జరిగిన ఏపీఎస్ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీ కీలక సమావేశంలో పలు ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆర్టీసీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించవద్దని, సంస్థ ప్రభుత్వ పరిధిలోనే కొనసాగాలని నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని విరుద్ధ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల భవిష్యత్తులో ఉద్యోగ భద్రత కరువయ్యే ప్రమాదం ఉందని



ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్టీసీని కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించడానికి ఈ సమావేశంలో రూట్ మ్యాప్ ఖరారు చేశారు. దశలవారీగా చేపట్టబోయే నిరసనల తీవ్రత ఎలా ఉండాలనే దానిపై యూనియన్ నాయకులు ముమ్మరంగా చర్చించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలి దశలో డిపోల వారీగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, ఆ తర్వాత రీజినల్ ఆఫీసుల ముట్టడి, మరియు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ ధర్నాలు నిర్వహించేలా తదుపరి కార్యాచరణను ఖరారు చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే సమ్మె నోటీసు ఇచ్చేందుకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు.

## బిహార్ రోడ్డు ప్రమాదంలో నెల్లూరు వాసుల మృతిపై మంత్రి నారాయణ దిగ్భ్రాంతి

అమరావతి, జూన్ 8: బిహార్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు యాత్రికులు మృతి చెందారు. నెల్లూరు జిల్లా యాత్రికుల మృతిపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రమాద వార్తపై తక్షణమే స్పందించిన మంత్రి నారాయణ.. బిహార్ అధికారులతో అత్యవసర సంప్రదింపులు జరిపారు.

ఈనెల 1న నెల్లూరు జిల్లా నుంచి పుణ్యక్షేత్రాల దర్శనానికి 40 మంది యాత్రికులు బస్సులో బయలుదేరారు. వీరంతా ఆత్మకూరు, దుత్తలూరు, సంగం మండలాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

వారణాసి వెళ్తుండగా లారీని ఓవర్‌టేక్ చేయబోయి యాత్రికుల బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో ఆత్మకూరుకు చెందిన ఒకరు, సంగం మండలానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు.

ప్రమాదంపై మంత్రి ఆనం విచారం బిహార్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసుల మృతిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. జిల్లా యాత్రికుల మృతిపై విచారం వ్యక్తం చేశారు. బిహార్ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.





## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకు న్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడం, పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మద్దతు దారులు, జనసైనికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీని బలోపేతం చేశామని, అయితే కొందరు నాయకుల ప్రవర్తన ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. నడవదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ వివరించారు.

కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు, సమన్వయ లోపం, క్రమశిక్షణరాహిత్యం కారణంగా పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు కమిటీల్లోని ఇతర సభ్యులను కూడా తమ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ లేని చోట పార్టీ వ్యవస్థ సక్రమంగా కొత్త కమిటీ నియామకం జరిగే వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను జనసేన కేంద్ర కార్యాలయం నేరుగా పర్యవేక్షిందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.



## బిహార్ ప్రమాదంపై సీఎం విచారం

అమరావతి, జూన్ 8: బిహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన కాశీ యాత్ర టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతోన్న వైద్యంపై ఆరా తీశారు. నెల్లూరు జిల్లా నుంచి 46 మంది యాత్రికులతో కాశీ వెళ్లిన ఈ బస్సు ఔరంగాబాద్ వద్ద మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని సీఎంకు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, 15 మందికి గాయాలయ్యాయని వివరించారు. బిహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బాధితులకు సాయం అందేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ప్రమాదం నుంచి బయటపడిన యాత్రికులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సీఎం ఆదేశాల మేరకు బిహార్ ఉన్నతాధికారులతో పాటు అక్కడి స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో ఏపీ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను గయాలోని అనుగ్రహ నారాయణ మగధ్ మెడికల్ కాలేజ్–హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులంతా క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. యాత్రికులను స్వస్థలాలకు చేర్చే అంశంపై బిహార్ ప్రభుత్వంతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

## జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడో తెలియడం లేదు సీఎం చంద్రబాబు

పశ్చిమగోదావరి, జూన్ 8: ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు(సోమవారం) సిద్ధాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం



ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు.



# గోవా వద్దు.. అదే ముద్దు..? జర్నీ, టూరిజంలోనూ వాటికే ప్రయారిటీ అంటున్న GenZ

ఒకప్పుడు పర్యాటక యాత్ర అంటే ఎక్కువ ప్రాంతాలు చూడటం, క్షణాల్లో ఫొటోలు దిగడం, హడావిడిగా ఊర్లు తిరగడం ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ కాలం మారింది. నేటి జెన్ గ్ యువత వేగవంతమైన ప్రయాణాల కంటే, ప్రశాంతమైన ప్రాంతాల్లో గడపడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీనినే 'స్లో ట్రావెల్' అని పిలుస్తున్నారు. ఒకే ప్రదేశంలో కొన్ని రోజుల పాటు లేదా వారాల పాటు ఉంటూ, అక్కడి సంస్కృతి, జీవనశైలిని మరియు ఆహారపు అలవాట్లను దగ్గరగా తెలుసుకోవడమే ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

నేటితరం రద్దీగా ఉండే పర్యాటక కేంద్రాలు, భారీ క్యూలు మరియు వాణిజ్యీకరణకు గురైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని కోరుకుంటోంది. ఉదాహరణకు, గోవా వంటి రద్దీ ప్రాంతాలకు బదులుగా గోకర్ణ వంటి ప్రశాంతమైన తీరాలను ఎంచుకుంటున్నారు. ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, ఎటువంటి ఒత్తిడి లేకుండా సమయాన్ని గడపడానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రయాణాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం కేవలం కొత్త ప్రదేశాలు చూడటం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతత మరియు భావోద్వేగ సమతుల్యతను సాధించడం.ప్రస్తుత యువత యోగా కేంద్రాలు, వెల్‌నెస్ రిట్రీట్స్, పచ్చని ప్రకృతి ఒడిలో ఉన్న ప్రాంతాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతోంది. పని ఒత్తిడి నుంచి విముక్తి పొందడానికి ఇలాంటి నిశ్శబ్ద ప్రదేశాలు ఎంతగానో తోడ్పడతాయి. ప్రయాణంలో భాగంగా స్థానిక వాతావరణాన్ని అనుభవించడం, యోగా లేదా ధ్యానం ద్వారా శరీరానికి, మనసుకు సేద తీర్చుకోవడం ఒక అద్భుతమైన అనుభవం.

### ఆహారమే అనుభవం

ప్రస్తుతం ప్రయాణాల్లో ఆహారం ఒక విడదీయలేని భాగంగా మారింది. సముద్ర తీరంలోని చిన్న చిన్న కేఫ్‌లు, స్థానిక వంటకాలు లభించే రెస్టారెంట్లలో భోజనం చేయడం ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. తాజా పదార్థాలతో వండిన స్థానిక ఆహారం, అలల శబ్దం, ప్రశాంతమైన వాతావరణం అన్నీ కలిసి ఒక గొప్ప జ్ఞాపకాన్ని మిగిలిస్తాయి.

స్లో ట్రావెల్ పద్ధతి పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. అతి తక్కువ ప్రయాణాలతో స్థానిక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించవచ్చు. మీరు కూడా మీ తదుపరి ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా? అయితే కంగారుగా పది ప్రదేశాలు తిరిగే కంటే, ఒకే ప్రదేశాన్ని పూర్తిగా ఆస్వాదించండి. హడావిడి లేని ప్రయాణం మీ మనసును, శరీరాన్ని నూతన ఉత్తేజంతో నింపుతుంది. జీవితాన్ని ఆస్వాదించడానికి, మిమ్మల్ని మీరు పునఃప్రారంభించుకోవడానికి 'స్లో ట్రావెల్' ఒక అద్భుతమైన మార్గం. మీ తదుపరి ప్రయాణాన్ని ప్రశాంతంగా, అర్థవంతంగా ప్లాన్ చేసుకోండి!

# చప్పట్లు కొడితే ఆరోగ్యం..!



మన అరచేతుల్లో శరీర భాగాలకు సంబంధించిన అనేక ఆక్యుప్రెషర్ పాయింట్లు, రిఫ్లెక్స్ జోన్లు ఉంటాయి. వాటిని తట్టి లేపడం వల్ల ఆ నాడులు చురుగ్గా మారి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. కండరాల నొప్పులు, అలసట తగ్గుతాయి. మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. జిమ్లకు వెళ్లే సమయం లేని ఉద్యోగినులు, గృహిణులు, వృద్ధులకు ఇది ఎంతో ఉపయోగకరం.

ఎలా చేయాలి...

నిలబడీ లేదా ప్రశాంతంగా కుర్చీలో కూర్చుని కూడా దీన్ని సాధన చేయవచ్చు. అరచేతులు పూర్తిగా ఒకదానికొకటి తగిలేలా చప్పట్లు చరవాలి. అలానే వివిధ పీడన బిందువులను లక్ష్యంగా చేసుకోవడానికి ఒక చేతి పిడికిలితో మరొక అరచేతిని తట్టడం, వెన్నెముక, వీపు... వంటి ప్రాంతాలను ఉత్తేజపరచడానికి అరచేతుల వెనక భాగాల్ని కలిపి చప్పట్లు కొట్టడం వంటివెన్నో ఇందులో భాగంగా చేయాలి.

శరీరాన్ని మరీ గట్టిగా బాదుకోకూడదు. చర్మం ఎర్రబడేలా కాకుండా, నాడులు ఉత్తేజితమయ్యేలా సున్నితంగా చరుచుకోవాలి. ఈ ప్రక్రియ చేస్తున్నంత సేపూ శ్వాసను నిదానంగా, సాధారణంగానే తీసుకోవాలి, బిగపట్టకూడదు.

రోజూ 10 నిమిషాలు ఈ కసరత్తులు చేస్తే మేలు. అయితే, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణులు... నిపుణుల సలహాతోనే దీన్ని చేయాలి. రోజువారీ జీవితంలో ఈ చిన్న అలవాటును చేర్చుకుంటే చక్కటి ఆరోగ్యం మీ సొంతమవుతుంది.



# గాజు బ్రేస్‌లెట్..

సంప్రదాయం మీద ప్రేమో... తమ ప్రత్యేకతను చాటాలనుకుంటున్నారో తెలియదు కానీ... ఈ తరం అమ్మాయిల తప్పనిసరి యాక్సెసరీల జాబితాలో గాజులు ఉంటున్నాయి. మట్టి, మెటల్, ఎంబ్రాయిడరీ అన్న తేడా కూడా చూపించట్లేదు. దుస్తులకు నప్పితే చాలు వేసేసుకుంటున్నారు. ప్రేమ సరే... పని విషయానికి వచ్చేసరికే కొన్నిసార్లు ఇవి అడ్డుగా తోస్తాయి. కాబట్టి, రోజువారీగా మాత్రం చాలావరకూ బ్రేస్లెట్కే ఓటేస్తున్నారు. అలాగని గాజులమీద ప్రేమని చంపుకోలేరు. పాపం ముచ్చటపడుతున్నారుగా! వాళ్లకి సాయం చేద్దామనుకున్నారో... వాళ్ల బాటలోనే నడుస్తూ సంప్రదాయానికి ఆధునికతను మిక్స్ చేద్దామనుకున్నారో... ఇదిగో ఇలా ‹హాఫ్ బ్యాంగిల్, బ్రేస్లెట్లు తీసుకొచ్చారు డిజైనర్లు. గాజు చేతిని పట్టి ఉంచితే చెయిన్ సౌకర్యానికి డోకా లేకుండా చూస్తుంది. మొత్తంగా స్టైలిష్ లుక్కి మాత్రం తెచ్చిపెడుతుంది. కాబట్టే, మోడరన్ గా కనిపిస్తూనే మినిమలిస్ట్ ఫ్యాషన్ని కోరుకునేవాళ్ల ఎంపిక ఇదవుతోంది. పైగా జీన్స్ టీ షర్ట్ అయినా చుడీదార్ అయినా పదే పదే మార్చాల్సిన పనీ ఉండదు. దుస్తులేవైనా అనువుగా ఉండటం వీటి ప్రత్యేకత. అంతేనా, మట్టి, రాజస్థానీ లక్క గాజులే కాదు... రోజ్‌గోల్డ్, వెండి, బంగారంలోనూ దొరికేస్తున్నాయి. అందానికి తోడు సౌకర్యం! మీకూ నచ్చాయా ఇవి? ఇంకేం ప్రయత్నించేయండి మరి!

# పాలలో పిస్తా ఉడికించి తింటే.. డయాబెటిస్, కీళ్ల నొప్పులు పరార్!



మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో సంబంధం లేకుండా ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. వీటిలో ప్రధానమైనది డయాబెటిస్ (మధుమేహం). ఒక్కసారి షుగర్ వ్యాధి బారిన పడితే జీవితకాలం మందులు వాడక తప్పదు. అయితే, సరైన ఆహారం తీసుకుంటే మందులతో పనే లేకుండా డయాబెటిస్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.

డయాబెటిస్‌ను నియంత్రించడంలో పిస్తా పప్పు అద్భుతంగా సహాయపడుతుంది. ఈ మధ్యకాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి ప్రతి ఒక్కరూ డ్రై ఫ్రూట్స్ తినడం అలవాటు చేసుకున్నారు. అయితే, చాలామంది డ్రై ఫ్రూట్స్‌ను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తింటుంటారు. కానీ, పిస్తా పప్పులను నీళ్లలో కాకుండా, పాలలో ఉడికించి తీసుకుంటే మన శరీరానికి రెట్టింపు ప్రయోజనాలు అందుతాయి.

పిస్తా పాలు ఎలా తయారు చేసుకోవాలి?

ముందుగా పొయ్యి మీద ఒక గిన్నె పెట్టి, అందులో ఒక గ్లాసు పాలు పోయాలి.పాలు కాస్త వేడెక్కాక, కేవలం ఐదు పిస్తా పప్పులను తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పాలలో వేయాలి.ఒక ఐదు నిమిషాల పాటు సన్నని మంట మీద పాలను బాగా మరగనివ్వాలి.పాలు గోరువెచ్చగా అయ్యాక, అందులోని పిస్తా ముక్కలను నములుతూ ఆ పాలను తాగాలి.

ఈ పాలు తాగడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు:

షుగర్ కంట్రోల్ : డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఈ పాలను తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది షుగర్ పేషెంట్లకు ఒక బెస్ట్ డ్రింక్ అని చెప్పవచ్చు.

దృఢమైన ఎముకలు: పాలు, పిస్తా పప్పు.. ఈ రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఈ పాలు తాగడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఇది మంచి ఉపశమనం ఇస్తుంది.

కండరాల బలం: శరీరానికి అవసరమైన హై-క్వాలిటీ ప్రోటీన్ ఈ పానీయం ద్వారా అందుతుంది. ఇది కండరాలను బలోపేతం చేసి నీరసాన్ని తగ్గిస్తుంది.కంటిచూపు మెరుగు: ఈ రోజుల్లో మొబైల్, సిస్టమ్ వాడకం విపరీతంగా పెరిగిపోయి చాలామంది కంటి సమస్యలతో బాధపడుతున్నారు. పిస్తా పాలను రెగ్యులర్‌గా డైట్‌లో చేర్చుకుంటే కంటి చూపు మెరుగుపడుతుంది.






# జామ రసం దివౌషధం



జామకాయ తినమంటే విసుగ్గా ముఖం పెట్టేవాళ్లే ఎక్కువ. ఇతర పండ్లతో పోలిస్తే అది చౌక. విరివిగా దొరుకుతుంది. అయినా దాన్ని పెద్దగా పట్టించుకోం. కానీ అది మహిళలకీ కౌమార దశలో ఉన్న బాలికలకీ ఎంతో మేలు అని బీఎంజే న్యూట్రిషన్ ప్రివెన్షన్ అండ్ జర్నల్ పేర్కొంటోంది. ముఖ్యంగా ఐరన్ లోపంతో బాధపడుతూ సప్లిమెంట్లు తీసుకునేవాళ్లు వాటితోపాటు జామ రసాన్ని తాగితే హీమోగ్లోబిన్ శాతం వేగంగా పెరుగుతుందట. సప్లిమెంట్ల అవసరం లేకున్నా మహిళలు క్రమం తప్పకుండా జామరసం తాగితే రక్తహీనత తలెత్తదు. అంటున్నారు పరిశోధకులు. అనేకచోట్ల చేసిన 17 అధ్యయనాల ఆధారంగా- పరిశోధకులు ఈ విషయాన్ని తేల్చి చెబుతున్నారు. అభివృద్ధి చెందుతోన్న అనేక దేశాల్లో గర్భిణులు, బాలికల్లో రక్తహీనత సర్వసాధారణ సమస్య. దీనివల్ల అలసట, నీరసం, ఏకాగ్రత లోపం, గర్భధారణ సమస్యలు వస్తున్నాయి. ఇది తీవ్ర అనారోగ్యానికి దారితీసి మరణాలకీ కారణమవుతుంది. అలాంటి ప్రమాదాల్నీ జామ నివారిస్తుందట. మొక్కల ఆధారిత ఆహారం నుంచి శరీరం ఇనుమును గ్రహించేందుకు జామలోని సి-విటమిన్ సాయపడుతుంది.

# రిచ్ న్యూట్రిషన్ ఫుడ్ ముళ్ల తోటకూర



మన ఇంటి చుట్టుపక్కల, పంట పొలాల్లో ఎన్నో రకాల మొక్కలు కనిపిస్తుంటాయి. వాటిలో ఏముందిలే అని కలుపు మొక్కల్లా భావించి పీకి పారేస్తుంటాం. కానీ, పల్లెటూళ్లలో ఉండే వారికి తెలుసు ఆయా మొక్కల్లో దాగి ఉన్న అద్భుతమైన ఔషధ గుణాలు ఏమిటో! అలాంటి కోవకే చెందుతుంది ముళ్ళ తోటకూర.

సాధారణంగా వరి పొలాల గట్ల మీద ఎక్కువగా కనిపించే ఈ ఆకుకూర కొమ్మల చివర చిన్న చిన్న ముళ్ళు ఉంటాయి. అందుకే దీనిని ముళ్ళ తోటకూర అని పిలుస్తారు.

ఎరుపు, ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో లభించే ఈ మొక్కలో మనకు తెలియని ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు, పోషకాలు దాగి ఉన్నాయి. అవేంటో ఇక్కడ చూద్దాం:

1. కిడ్నీలో రాళ్లకు దివ్యౌషధం: మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి ముళ్ళ తోటకూర అద్భుతంగా పనిచేస్తుంది.

ముందుగా ఈ చెట్టు వేర్లను సేకరించి, శుభ్రంగా కడిగి ఎండబెట్టుకోవాలి.

ఈ వేరును అవసరమైనప్పుడు సాన రాయి మీద కొద్దిగా నీళ్లు పోసి అరగదీయాలి.

అలా వచ్చిన గంధాన్ని (పేస్ట్) అర స్పూన్ మోతాదులో తీసుకుని, ఒక గ్లాస్ నీటిలో కలుపుకోవాలి.

ప్రతిరోజూ భోజనానికి అరగంట ముందు ఈ నీటిని తాగితే.. కిడ్నీలో ఉన్న చిన్న చిన్న రాళ్లు సులభంగా కరిగిపోయి మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తాయి.

2. గాయాలకు తక్షణ మందు: పొలాల్లో పనిచేసేటప్పుడు లేదా ఇంట్లో ఏదైనా చిన్నపాటి గాయాలు అయినప్పుడు వెంటనే బ్లీడింగ్ అవుతుంటుంది.

అటువంటి సమయంలో ఈ ముళ్ళ తోటకూర ఆకులను మెత్తని పేస్ట్‌లా నూరి, ఆ గాయం మీద రాయాలి. ఇలా చేయడం వల్ల రక్తస్రావం వెంటనే ఆగిపోవడమే కాకుండా, గాయం కూడా త్వరగా మానుతుంది.

3. చర్మ సమస్యలు, దద్దుర్లు : చర్మంపై అకస్మాత్తుగా వచ్చే దద్దుర్లు, దురదలకు కూడా ఈ ఆకులు బాగా పనిచేస్తాయి. ముళ్ళ తోటకూర ఆకుల పేస్ట్‌ను దద్దుర్లు ఉన్న చోట రాస్తే చాలా తొందరగా ఉపశమనం లభిస్తుంది.





## ఎందుకంత కడుపుమంట..

సౌత్ సినిమా అంటే బాలీవుడ్‌కు ఒకప్పుడు చిన్నచూపు. ఇప్పుడు ఈర్ష్య, ద్వేషం. అందుకు కారణం. కొన్నేళ్లగా టాలీవుడ్ సాధిస్తున్న రికార్డులు, గ్లోబల్ స్థాయిలో దక్కుతున్న ఆదరణ చూసి బాలీవుడ్ వర్గాల్లో కడుపుమంట ఉందనేది అందరికీ తెలిసిందే! బాలీవుడ్‌లో అప్పుడప్పుడు కంటెంట్ ఉన్న చిత్రాలొస్తాయి. మిగతావన్నీ కమర్షియల్, గ్లామర్ చిత్రాలే! కంటెంట్ పరంగా సౌత్ సినిమాతో పోటీ పడలేని పరిస్థితి ఉత్తరాది సినిమాది. అందుకే మన చిత్రాల్లో చిన్నచిన్న లోపాలను వేలెత్తి చూపించడం, అక్కడి కొందరు సెలబ్రిటీలకు, ముఖ్యంగా బాలీవుడ్ మీడియాకు పరిపాటి అయిపోయింది. తాజాగా రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' సినిమా విషయంలో హీరోయిన్ జాన్వీ కపూర్ పోషించిన పాత్ర గురించి చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే! అచ్చియమ్మ పాత్రను ఓవర్ గ్లామర్‌గా చిత్రీకరించారని, కొన్ని సన్నివేశాలైతే అభ్యంతరకరంగా ఉన్నాయని బాలీవుడ్‌కు చెందిన ఓ బ్యాచ్, సంబంధిత సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా విమర్శల దాడికి దిగింది.తెలుగు సినిమా వార్తలు

## క్షమాపణ చెప్పిన పెద్ది సినిమా దర్శకుడు బుచ్చిబాబు




పెద్ది సినిమాలో అభ్యంతరకర సన్నివేషాలున్నాయని వాటిని వ్యతిరేకిస్తూ సామాజిక మాధ్యామాల్లో వచ్చిన విమర్శలకు ఆ సినిమా దర్శకుడు బుచ్చిబాబా స్పందించారు. ఈ చిత్రంలో కథానాయికగా నటించిన జాన్వీ కపూర్ ను అసభ్యకరంగా చూపించారని, అనేకసార్లు పైట తీయించి మహిళలను కించపరిచే విధంగా సన్నివేషాలు చిత్రీకరించారని తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో దర్శకుడు క్షమాపణ చెప్పక తప్పలేదు. మహిళలంటే తనకు అపారమైన గౌరవమని, వారిని తక్కువ చేసే ఉద్దేశం తనకు ఏంతమాత్రం లేదని అలా ఎవరికైనా అనిపిస్తే తనను క్షమించమని ఎక్స్ వేదిక ద్వారా పేర్కోన్నారు. ప్రేక్షకుల కోరిక మేరకు అలాంటి సన్నివేషాలలో మార్పులు చేస్తానని చెప్పారు. సినిమా, పాత్రల విలువలను తగ్గించకుండా ఇక ముందు జాగ్రత్తలు తీసుకుంటానని పేర్కోన్నారు.

సినిమాల్లో అసభ్యకర సన్నివేషాలపై ప్రేక్షకులు ఇలా స్పందించడం విశేషం. ఇలాంటి అభ్యంతరకర సన్నివేషాలతో వచ్చే సినిమాలన్నీటిపై ప్రేక్షకులు ఇలా స్పందిస్తే తప్పకుండా భవిష్యత్తులో మంచి సినిమాలు వస్తాయి.

దర్శకుడు బుచ్చిబాబు చెప్పినట్టు పెద్ది సినిమాలో మార్పులు చేయిస్తారా? అది సాధ్యమవుతుందా? చూద్దాం...

– నూతి శివానందం



## తీవ్రంగా కష్టపడుతున్న వెంకీ మామ

టాలీవుడ్ సీనియర్ హీరో, విక్టరీ వెంకటేశ్ తన వయసుతో నిమిత్తం లేకుండా నవతరం హీరోలకు సైతం గట్టి పోటీ ఇస్తూ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో వెంకీ నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన వెంకటేశ్ పోర్షన్ షూటింగ్ అంతా జులై నాటికి పూర్తి కానుందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఈ చిత్రాన్ని ఎలాగైనా దసరా పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ పక్కా ప్లాన్‌తో ఉన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.





## చరిత్ర సృష్టించిన భారత్

టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా చరిత్ర సృష్టించింది. 94 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే కని విని ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌లో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. ఆ తర్వాత తమకు అలవాటైన రీతిలో స్పిన్‌తో ప్రత్యర్థికి ఉచ్చు బిగించింది. టెస్ట్‌ల్లో భారత్‌కు ఇదే అతిపెద్ద ఇన్నింగ్స్ విజయం. 2018లో వెస్టిండీస్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఇన్నింగ్స్ 272 రన్స్‌తో గెలుపొందింది. ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద విజయంగా ఉండగా.. తాజా ఫలితం దాన్ని అధిగమించింది. భారత్ గడ్డపై ఇది రెండో అతిపెద్ద టెస్ట్ విజయం. 1958లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై వెస్టిండీస్ ఇన్నింగ్స్ 336 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ రికార్డ్ ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది.

తాజా ఫలితంతో టెస్ట్‌ల్లో అతిపెద్ద విజయం సాధించిన రెండో ఆసియా టీమ్‌గా భారత్ నిలిచింది. ఈ జాబితాలో భారత్ కంటే పాకిస్థాన్ ముందుంది. 2002లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్తాన్ ఇన్నింగ్స్ 324 పరుగుల తేడాతో గెలుపొందింది.

## లైవ్‌లోనే రిపోర్టర్‌పై విరుచుకుపడ్డ హర్మన్‌ప్రీత్ కౌర్




ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి ముందే టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వార్తల్లో నిలిచారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల కెప్టెన్లందరితో నిర్వహించిన అధికారిక మీడియా సమావేశంలో హర్మన్‌ప్రీత్ కౌర్ , ఓ మహిళా రిపోర్టర్ మధ్య తీవ్రమైన వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. రిపోర్టర్ అడిగిన రిటైర్మెంట్ ప్రశ్నకు భారత కెప్టెన్ ఘాటుగా సమాధానం ఇవ్వడమే ఇందుకు కారణం.

రిటైర్మెంట్ ప్రశ్నకు హర్మన్‌ప్రీత్ కౌర్ ఫైర్ మీడియా సమావేశం సందర్భంగా ఓ రిపోర్టర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఉద్దేశించి.. హర్మన్‌ప్రీత్ కౌర్.. ఇది మీకు చివరి టీ20 ప్రపంచ కప్ అవుతుందా? దీనిపై మీరేమంటారు? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతో ఒక్కసారిగా అసహనానికి గురైన హర్మన్‌ప్రీత్ కౌర్.. ఇది నా చివరి వరల్డ్ కప్ ఎందుకు అవుతుంది? నేనేమైనా రిటైర్ అయిపోవాలని మీరు కోరుకుంటున్నారా? అంటూ హర్మన్‌ప్రీత్ ఎదురుప్రశ్న వేశారు. దాంతో సదరు రిపోర్టర్ పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తూ.. లేదు.. నేను కేవలం తెలుసుకోవాలని అడిగాను. ఇది మీ చివరి ప్రపంచకప్ కాదని వినడం నాకు సంతోషంగా ఉంది. అని రిపోర్టర్ చెప్పారు. అయినప్పటికీ తగ్గని హర్మన్‌ప్రీత్ కౌర్.. ఃఃమరి అలాంటప్పుడు అసలు ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు? అంటూ నిలదీశారు.

జూన్ 14న పాకిస్థాన్‌తో టీమిండియా తొలి మ్యాచ్ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నమెంట్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. లండన్‌లో జరగబోయే ఈ మెగా టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు, శ్రీలంకతో తలపడనుంది. ఇక భారత జట్టు జూన్ 14న తన సాంప్రదాయ ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడటం ద్వారా ఈ టోర్నీలో తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఐదేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. టీమిండియా ఉన్న గ్రూపులో పాకిస్తాన్‌తో పాటు నెదర్లాండ్స్, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, బలమైన ఆస్ట్రేలియా జట్లు ఉన్నాయి. గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత రెండు గ్రూపుల నుంచి టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. వరల్డ్ కప్‌లో టీమిండియా ట్రాక్ రికార్డ్ మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయింది.

మెట్రో స్పోర్ట్స్

## విప్లవాత్మక మార్పులతో..



ప్రతిష్ఠాత్మక ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ మరో మూడ్రోజుల్లో మొదలవనుంది. ఈసారి టోర్నీ విప్లవాత్మక మార్పులతో మన ముందుకొస్తోంది. ఆటలో మరింత పోటీతత్వం పెంచడంలో భాగంగా సరికొత్త నిబంధనలను ఫిఫా రూపొందించింది. అవేంటంటే.. బంతి మైదానం నుంచి బయటికి వెళ్లాక ఆటగాళ్లకు దాన్ని లోపలికి విసిరేందుకు 5 సెకన్లకంటే ఎక్కువ సమయం ఉండదు. ఎవరైనా కావాలని రీస్టార్ట్‌ను ఆలస్యం చేస్తే ప్రత్యర్థి జట్టుకు త్రో-ఇన్ అవకాశం ఇస్తారు.

బంతిని తన్నడానికి లేదా పాస్ చేయడానికి గోల్ కీపర్‌కు కూడా కేవలం 5 సెకన్ల సమయమే ఉంటుంది. ఆలస్యం చేస్తే ప్రత్యర్థికి వెంటనే కార్నర్ కిక్ అవకాశమిస్తారు.

సైడ్‌లైన్ దగ్గర వైద్య చికిత్స తీసుకునేందుకు ఆటగాళ్లు వెళ్లి, తిరిగి రావడానికి నిమిషం సమయం తీసుకోవాల్సి ఉంటుంది. వాగ్వాద సమయాల్లో ఆటగాళ్లెవరూ తమ నోళ్లను కవర్ చేసుకుని మాట్లాడడాన్ని అనుమతించరు. ఎవరైనా అలా చేస్తే రెడ్ కార్డుకు గురవుతారు. ఈ నిబంధనను వరల్డ్‌కపనకే గాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా జరిగే అన్ని ఫుట్‌బాల్ టోర్నమెంట్లో అమలు చేయనున్నారు. ఆటలో రేసిజం కట్టడి చేయడంలో భాగంగా ఈ నిబంధనను రూపొందించారు.

ఇక నుంచి ఆటగాళ్లకు ఆట ప్రథమార్ధం, ద్వితీయార్థాల్లో మూడు నిమిషాల చొప్పున హైడ్రేషన్ విరామం లభిస్తుంది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007